
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
మంగళవారం 4 నవంబరు 2025



ఆస్తి రాయించుకుని గెంటేశాడయ్యా!

మనవడి నిర్వాకంపై వృద్ధ దంపతుల ఆవేదన

న్యాయం చేయాలని కలెక్టర్‌కు వేడుకోలు



నెల్లూరు (హరనాథపురం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మానవత్వం మంట కలిసింది. ఎవరినీ నమ్మే పరిస్థితులు ఇప్పుడు లేవు. ఏళ్ల తరబడి పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను పట్టించుకొనే వారు కరువవుతున్నారు. కన్నకొడుకు మీద నమ్మకం లేక మనవడి మీద ఆస్తి రాసిన ఆ వృద్ధులకు చివరకు నిరాశే మిగిలింది. కొడవలూరు మండలం యల్లాయపాలెంకు చెందిన దామర్ల శంకరమ్మ, రమణయ్యలు తమ కుమారుడికి బదులుగా మనవడి పేరిట తమ ఆస్తి 98 సెంట్ల భూమిని దస్తావేజులు రాయించి రిజిస్టర్ చేయించారు. ఆస్తి రాయించుకునే వరకు బాగా చూసుకుంటానని నమ్మబలికిన మనవడు అంతా అయ్యాక ఇంటి నుంచి వెళ్లిపోండి అంటూ బెదిరింపులకు దిగుతున్నాడు. ఇంటిలో నుంచి గెంటేశాడు. మనవడు ఇలా చేశాడని కన్నకొడుకుకు విషయం చెప్పబోగా ఆయన ముఖం చాటేశాడు. తమకు జరిగిన అన్యాయం ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఆ వృద్ధ దంపతులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావిజ్ఞప్తుల దినానికి హాజరై కలెక్టర్ హిమాన్షు శుక్లాకు తమ గోడును వెల్లబోసుకున్నారు. నిలువ నీడ లేదని, ఇక తామెలా జీవించాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అధికారులతో విచారించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో వెనుతిరిగారు.

కార్తీక వైభోగం

- భక్తిశ్రద్ధలతో సోమవారపు పూజలు
- ఆలయాలకు తరలివచ్చిన భక్తజనం







మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాల్లో రుద్రాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం ప్రదోషకాలంలో నందీశ్వరుడికి, శివుడికి అభిషేకాలు, విశేష అలంకారం, ప్రాకారోత్సవాలు కనులపండువగా జరిగాయి. నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. సాయంత్రం ప్రదోషకాల పూజలలో నందీశ్వరుడికి, మూలస్థానేశ్వరుడికి విశేష అభిషేకాలు జరిగాయి. భువనేశ్వరి అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారం జరిగింది. ప్రాకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాలను ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి తదితరులు పర్యవేక్షించారు. జొన్నవాడ, సంగం, భైరవకోన తదితర ప్రాంతాల్లో భక్తులు పోటెత్తారు.

● రాజరాజేశ్వరి ఆలయంలో జరిగిన కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు. స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు భారీ సంఖ్యలో కార్తీక దీపారాధనలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోటగురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు పేగు షణ్ముఖరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● స్వర్ణ గరుడుడిపై రంగనాథుడు

కార్తీక మాసం చిలుక ద్వాదశి సందర్భంగా తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి తిరుమంజనం కనుల పండువగా జరిగింది. సాయంత్రం బంగారు గరుడసేవ, పేట ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్థానిక ఉత్తరాధి మఠంలో తులసీ కల్యాణం వైభవంగా జరిగింది.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

70 టీఎంసీల చేరువలో సోమశిల

అనంతసాగరం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయంలో నీటిమట్టం 70 టీఎంసీల చేరువలో ఉంది. సోమవారం ఎగువ నుంచి 16,918 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, దిగువకు 12,650 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 69.916 టీఎంసీలు నిల్వ ఉంది.

● **రాపూరు** : మండలంలోని కండలేరు డ్యాంలో 58.78 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 840 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 700 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.



పోలినేనిచెరువులో తెల్లరాయిని చిన్న సైజుగా మారుస్తున్న కూలీలు

తెల్లరాయి తరలిపోతోంది!

- యథేచ్ఛగా తవ్వేస్తున్న అక్రమార్కులు
- లారీల ద్వారా చెన్నైకి... అక్కడ నుంచి విదేశాలకు..
- అన్నీ తెలిసి మిన్నకుండిపోతున్న యంత్రాంగం

వలేటివారిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలినేనిచెరువు రెవెన్యూ, అటవీ భూముల్లో తెల్లరాయి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రిపూట ఎక్స్‌కవేటర్లతో రాయిని వెలికితీసి, టిప్పర్ల ద్వారా పోలినేనిచెరువు రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూముల్లోకి చేర్చి ముక్కలుగా మారుస్తున్నారు. ఆ తర్వాత రహస్యంగా పొరుగు ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. నిత్యం 50 టన్నులకుపైగా గూడూరుకు అక్కడ నుంచి చెన్నైకు, ఆ తర్వాత విదేశాలకు తరలిపోతోంది. ప్రభుత్వానికి రాయల్టీ ఇతరత్రా రూపాల్లో రావల్సిన ఆదాయానికి అక్రమార్కులు భారీగా గండికొడుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు రెవెన్యూ, ఇటు అటవీ శాఖల అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

● తెల్లరాయి ఉన్న ప్రాంతాలివే

మండలంలోని పశ్చిమ ప్రాంతంలో పోలినేనిచెరువు, అయ్యవారిపల్లె, మాలకొండ, గరుకుపాలెం, చుండి, వీరన్నపాలెం, పెద్దఅమ్మపాలెం, వలేటివారిపాలెం, అంకభూపాలపురం తదితర గ్రామాల్లోని అటవీ, రెవెన్యూ భూముల్లో తెల్లరాయి దొరుకుతుంది. వలేటివారిపాలెంలో నామమాత్రంగా కొంత ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకొని, దాని ఆసరాగా ఇష్టానుసారం తవ్వకాలు జరిపి, రూ.లక్షలు గడిస్తున్నారు.

● తెల్లరాయికి మంచి డిమాండ్

ఈ ప్రాంతంలో దొరికే ఏ గ్రేడ్ తెల్లరాయికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. జపాన్, రష్యా, సింగపూర్, ఇండోనేషియా దేశాలకు ఎగుమతి అవుతుంది. ఈ తెల్లరాయిని పలు రకాల మందుల తయారీకి వినియోగిస్తారు.

● ఐదేళ్లుగా అడ్డగోలుగా..

పోలినేనిచెరువులో ఐదేళ్ల నుంచి తెల్లరాయిని అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. ఏ గ్రేడ్ రకం టన్ను రూ.25 వేలు ధర పలుకుతుండటంతో అక్రమార్కులు ఇతర ప్రాంతాల నుంచి కూలీలకు తీసుకొచ్చి తవ్వకాలు జరిపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తెల్లరాయి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆశ పెట్టి.. ముంచేశారు!



- పేదల పాలిట శాపంగా ఓటీఎస్ ● నాటి జగన్ సర్కారు నిర్వాకం
- ఎందుకూ పనికి రాకుండా రిజిస్ట్రేషన్ పత్రాలు
- రుణాలు పొందాలంటే రిజిస్ట్రేషన్ శాఖ, బ్యాంకర్ల నిరాసక్తత
- ప్రస్తుత ప్రభుత్వమైనా ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

అల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏ ప్రభుత్వమైనా ఒక పథకాన్ని ప్రవేశపెడితే దాని ఫలితాలు పేద, మధ్య తరగతి ప్రజల జీవనానికి దోహదపడేలా ఉండాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పథకాల్లో ఒకటి సామాన్యుల పాలిట శాపంగా మారింది. అదే ఓటీఎస్ పథకం. గతంలోని కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలకు పక్కా గృహాలను నిర్మించుకునేందుకు అనుకూలతను బట్టి 18 నుంచి 30 అంకణాల వరకు నివేశన స్థలాలను మంజూరు చేసి గృహాలను సైతం నిర్మించి ఇచ్చాయి. ఇవి విక్రయించేందుకు వీలు లేకుండా వారసత్వంగా అనుభవించుకునేలా ఉత్తర్వులను జారీ చేసి, కాలనీలను నిషేధిత జాబితాలో పొందుపరిచారు.

● ఓటీఎస్ పథకం ఇలా..

గత ప్రభుత్వాల్లో ఇచ్చిన ఆస్తులకు శాశ్వత హక్కును కల్పిస్తామంటూ నాటి వైసీపీ సర్కారు ఓటీఎస్ (వన్ టైమ్ సెటిల్మెంటు) పేరుతో నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియను తీసుకొచ్చింది. ఈ ప్రక్రియ ద్వారా కాలనీల్లో గృహాలను రిజిస్ట్రేషన్ చేస్తామంటూ లబ్ధిదారుల వద్దకే అధికారులను పంపింది. దీనిపై దూరదృష్టి లేని ప్రజలు తమ ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం వస్తుందంటూ ఆశ పడ్డారు.

● రూ.10 వేలకే రిజిస్ట్రేషన్ అంటూ..

ఈవిధంగా వచ్చిన ఆస్తులకు ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేస్తుందని నమ్మబలికి పట్టాదారుడే నివాసం ఉంటే సదరు ఆస్తికి ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారు. యజమాని నుంచి మరొకరికి చేయి మారి ఉంటే రూ.10 వేలు, మూడో వ్యక్తికి మారి ఉంటే రూ.20 వేలు రిజిస్ట్రేషన్ రుసుముతో రిజిస్ట్రేషన్ చేపట్టి వారి పేరుతో పత్రాలను కూడా అందజేశారు. ఇలా దాదాపు పదివేలకుపైగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం.

● ఇక్కడే సమస్య

గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతూ బ్యాంకులలో రుణాలను సైతం పొందవచ్చని, అందుకు తాను హామీగా ఉండి రుణాలు అందేలా తాను చర్యలు తీసుకుంటామని నాటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. ఈ ప్రకటన వినగానే ప్రజలు పూర్తిగా నమ్మేశారు. అప్పో సప్పో చేసి నగదు తీసుకొచ్చి వీఆర్వోలకు చెల్లించి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ పొందారు.

● బ్యాంకర్లు కుదరదన్నా..

అయితే, నాటి ప్రభుత్వ నిర్ణయంపై బ్యాంకర్లు స్పందిస్తూ తమ నిబంధనల ప్రకారం ఓటీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ పొందిన పత్రాలపై రుణాలు పొందే అవకాశం లేదని, రుణాలు ఇచ్చేది లేదని కరాఖండీగా చెప్పారు. అయినా లెక్కచేయని జగన్ ప్రభుత్వం ఈ విషయంలో వెనుకడుగు వేయలేదు. దీంతో పేదల నుంచి ముక్కుపిండి వసూలు చేసి వద్దన్నా రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఈ పథకాన్ని జగన్ సర్కారు ప్రవేశపెట్టింది ప్రజల శ్రేయస్సు కోసం కాదని, రూ.4 వేల కోట్ల సేకరణ లక్ష్యాన్ని సాధించేందుకని అప్పట్లో ముమ్మరంగా ప్రచారం నడిచింది. ఇదే ఇప్పుడు నిజమైంది.

● నిండా మునిగిన లబ్ధిదారులు

ఓటీఎస్ పథకం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న లబ్ధిదారులు నిండా మునిగిపోయారు. ఓటీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు అటు రుణాలు పొందాలంటే ప్రభుత్వ అనుబంధ బ్యాంకులు అప్పుడే తమ నిర్ణయాన్ని వెల్లబుచ్చాయి. ఇటీవల విచ్చలవిడిగా పుట్టుకొచ్చిన ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు తాము గృహ

- మిగతా 7లో..

వద్దన్నా.. ఓటీఎస్ రిజిస్ట్రేషన్ చేశారు!



వైసీపీ ప్రభుత్వంలో చేసిన పొరపాటు వల్ల నా ఇల్లు రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు పడదని రిజిస్ట్రేషన్ శాఖాధికారులు అంటున్నారు. రుణం పొంది ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడదామని ప్రయత్నిస్తే ఎవరూ సహకరించడం లేదు. ఇల్లు ఉండి కూడా ఆర్థిక ఇబ్బందులకు ఉపయోగపడని పరిస్థితి.

- విడవలూరు శోభన్, కొత్త సింగపేట, అల్లూరు మండలం

ఉపయోగపడని ఓటీఎస్ ఎందుకు?



ప్రభుత్వం ఏదైనా ప్రక్రియ చేపడితే అది ప్రజల సంక్షేమం కోసమై ఉండాలి. ఉపయోగపడని ఓటీఎస్ రిజిస్ట్రేషన్‌ను ఎందుకు చేపట్టాలి. మేమేమన్నా అడిగామా!?. అవసరం లేకున్నా ఓటీఎస్ చేసి నేడు నా ఆర్థిక సమస్యల్లో నుంచి బయటపడే వీలు లేకుండా చేశారు.

- గోడ లాజర్, సింగపేట, అల్లూరు మండలం

చంద్రబాబు స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు



'వీపీఆర్ నేత్ర' ప్రారంభోత్సవంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి

- వివరాలు 8లో..

ఔషధ నియంత్రణ శాఖ అధికారిగా హరిహర తేజ

నెల్లూరు (వైద్యం) నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారిగా డి. హరిహర తేజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నేతలు కలిసి, సత్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పేరూరి ప్రదీప్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి నరేంద్ర, అశోక్, భాస్కర్, లీలా మోహన్, పవన్, పాండు, శీను తదితరులు పాల్గొన్నారు.

ధర్తీ ఆబా పథకం కింద 21 గ్రామాల అభివృద్ధి

వేదగిరి క్షేత్రంలో ముగిసిన పవిత్రోత్సవాలు

8 లో..

ప్రజాధనానికి తుప్పు పట్టిస్తారా!?

- 'చెత్త' పనులపై జిల్లా న్యాయాధికారి సీరియస్ ● ఈ-ఆటోలు, ట్రాక్టర్లు మూలనపడడంపై ఆగ్రహం
- సుమోటోగా లోక్ అదాలత్‌లో కేసు నమోదు ● ఎస్సీ కార్పొరేషన్, మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులకు నోటీసులు ● చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు సూచన

నెల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అందాల్సిన స్వయం ఉపాధి వాహనాలు.. ఓ చోట నిరుపయోగంగా పడి ఉండడాన్ని నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ సీరియస్‌గా తీసుకున్నారు. ప్రజాధనానికి తుప్పు పట్టేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎవరిదీ చెత్త పాపం..?' శీర్షికన జూన్ 18వ తేదీన ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో ఓ కథనం ప్రచురితమైంది. సుమారు రూ.4 కోట్ల విలువ చేసే ఈ యంత్రాలను అధికారులు తమకు సంబంధం లేదన్నట్లుగా వదిలేశారు. ఈ వ్యవహారం నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ శ్రీనివాస్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రజా ధనాన్ని నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. ఈ మేరకు సుమోటోగా కేసు నమోదు చేయాలని లోక్ అదాలత్ జడ్జిని ఆదేశించారు. ఆ వెంటనే కేసు నమోదు కావడం, తదుపరి అధికారులకు నోటీసులు జారీ కావడం జరిగిపోయాయి. గత నెలలో మున్సిపల్, ఎస్సీ కార్పొరేషన్, పంచాయతీ రాజ్ అధికారులు లోక్‌అదాలత్ కోర్టులో విచారణకు హాజరయ్యారు. మూలనపడి ఉన్న వాహనాలకు సంబంధించి పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించారు. ఇన్నాళ్లపాటు ఆ వాహనాలను ఎందుకు నిరుపయోగంగా వదిలేశారన్నదానిపై కూడా కోర్టుకు వివరణ ఇచ్చుకున్నారు.


● గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2018-19 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 165 ఈ-ఆటోలు మంజూరు చేశారు. ఈ ఆటోల ద్వారా పంచాయతీల్లో చెత్తను సేకరించాల్సి ఉంది. 2019 ఎన్నికలకు ముందే 112 మంది లబ్ధిదారులకు సంబంధించిన ఈ-ఆటోలను పంచాయతీలకు అప్పగించారు. మరో 53 వాహనాలను సంబంధిత ఏజెన్సీ ఆలస్యంగా డెలివరీ చేసింది. అలానే మెకనైజ్డ్ డ్రై క్లీనింగ్ యంత్రాల యూనిట్లు 46 మంజూరయ్యాయి. ఇందులో 23 యంత్రాలను లబ్ధిదారులకు అందించారు. మిగిలినవి ఆలస్యంగా డెలవరీ కావడంతో బుజబుజనెల్లూరులోని ఓ ఖాళీ స్థలంలో దించి ఉంచారు.



బుజబుజనెల్లూరులో ఉన్న ఆటోలు (ఫైల్)

2019లో ప్రభుత్వం మారడంతో ఈ వాహనాలను ఎవరూ పట్టించుకోలేదు. లబ్ధిదారులకు అందించేందుకు అనుమతులు ఇవ్వాలంటూ పలుమార్లు జిల్లా నుంచి రాష్ట్ర అధికారులకు లేఖలు వెళ్లినా అక్కడి నుంచి స్పందన లేదు. జిల్లాలో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ అధికారులు కూడా మారిపోవడంతో వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు 53 ఈ-ఆటోలు, 23 మెకనైజ్డ్ డ్రైక్లీనింగ్ యంత్రాలు మూలనపడ్డాయి. ఈ వాహనాల దుస్థితిని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చే వరకూ ప్రస్తుత అధికారులెవరికీ తెలియకపోవడం గమనార్హం.



● బ్యాటరీలు చోరీ

తాజాగా జిల్లా జడ్జి జోక్యంతో రంగంలోకి దిగిన అధికారులు బుజబుజ నెల్లూరులోని వాహనాలను సాంకేతికంగా పరీక్షించారు. అందులో చాలా వాటిల్లో బ్యాటరీలో చోరీకి గురైనట్లు గుర్తించారు. దాదాపుగా ఈ-ఆటోలు ఇక పనికిరావన్న నిర్ధారణకు వచ్చారు. అయితే మెకనైజ్డ్ డ్రైక్లీనింగ్ యంత్రాలను మాత్రం బాగు చేయించి ఉపయోగంలోకి తీసుకురావచ్చని తేల్చారు. అయితే ఇందుకు నిధులు ఎక్కడి తీసుకురావాలన్నది సమస్యగా మారింది. దీంతో ఈ విషయాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లాకు నివేదించారు. ఆయన ఉన్న విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేశారు. కాగా ఈ వ్యవహారంలో ఓ లబ్ధిదారుడు ఇటీవల జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు వేసినట్లు తెలిసింది. మెకనైజ్డ్ డ్రైక్లీనింగ్ యంత్రానికి తనను అర్హుడిగా గుర్తించి కొంత డబ్బులు కూడా కట్టించుకున్నారని, కానీ తనకు యంత్రాన్ని ఇవ్వలేదంటూ సదరు వ్యక్తి ఫోరాన్ని ఆశ్రయించడంతో ఎస్సీ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యానికి గానూ రూ.5 లక్షలు జరిమానా విధించినట్లు ఎస్సీ కార్పొరేషన్ వర్గాల ద్వారా తెలిసింది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

21మంది అడ్మిన్లకు నోటీసులు జారీ

మనుబోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో 21 మంది సోషల్ మీడియా అడ్మిన్లకు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు ఎస్‌ఐ. శివరాకేష్ సోమవారం నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా, లేదా మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే అడ్మిన్లు తొలగించాలన్నారు. లేనిపక్షంలో అడ్మిన్లు పోలీసులు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారంటూ నోటీసులు ఇచ్చి వారిచే సంతకాలు చేయించుకున్నారు. అన్ని రాజకీయపార్టీల నాయకులకు నోటీసులు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11619
వెండి కిలో ధర	రూ. 153100
వెండి ఒక గ్రాము	రూ. 159.10

నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు


పూజలు చేస్తున్న ఆలయ పండితులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా నందీశ్వరుడికి ఆలయ పండితులు భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు నిర్వహించారు. గణపతిపూజ, స్వస్తి వాచనం, ప్రదోష కాల సమయంలో ఏకాదశ ద్రవ్యాభిషేకం, వృషభార్చన, పంచ హారతులు, మహానివేదన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. మల్లికార్జునస్వామికి ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు ముందుగా ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి ప్రదోషకాల పూజల్లో పాల్గొన్నారు.

ఆహ్లాదకర ప్రయాణం... ఆదమరిస్తే.. తప్పదు ప్రమాదం !

ఘాట్ రోడ్డులో రక్షణ చర్యలు నిల్

రాపూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు, అన్నమయ్య జిల్లాల సరిహద్దు ప్రాంతాలైన రాపూరు చిట్వేలి ఘాట్ రోడ్డు అడవులకు ప్రసిద్ధి. ఇప్పటికే వర్షాలు కురుస్తుండడం, వృక్షాలు పచ్చగా చిగురిస్తుండటంతో ఈ ప్రాంతం ప్రకృతి రమణీయతను సంతరించుకుంది. ఈ మార్గంలో ప్రయాణం.. ఓ అద్భుతమైన, ఆహ్లాదకరమైన అనుభూతి. అయితే.. వాహనచోదకులు ఈ అందాలను చూస్తూ ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. ప్రమాదాల బారిన పడకతప్పదు. రాపూరు నుండి చిట్వేలికి 30 కిలో మీటర్లు ఉండగా, ఇందులో 15 కిలో మీటర్ల మేర ఘాట్ రోడ్డు ఉంది. సరిహద్దు అటువైపు పూర్తి స్థాయిలో రోడ్డును ఆధునీకరించగా... సరిహద్దుకు ఇటువైపు రోడ్డు చాలా చోట్ల దెబ్బ తినింది. రక్షణ గోడలు కూలిపోయాయి. ఏదైనా ప్రమాదం జరిగినపుడు చర్యలు తీసుకోవడం కన్నా... ముందుగానే ఈ ఘాట్ రోడ్డును ఆధునీకరించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఘాట్ రోడ్లపై కానరాని రక్షణ చర్యలు...

మామూలు సాదా రోడ్లతో పోలిస్తే ఘాట్‌రోడ్డులో వాహనాలు నడిపేవారు అత్యంత అప్రమత్తంగా వుండాలి. రహదారి నిర్వహణ, ప్రమాదకరమైన మలుపులు, రక్షణ గోడల స్థితిగతులను అధికారులు ఎప్పటికప్పుడు తప్పక పరిశీలిస్తూ వుండాలి. కానీ రాపూరు చిట్వేల్ ఘాట్‌రోడ్లలో రక్షణ చర్యలు అంతంత మాత్రంగానే వున్నాయి. అనేక చోట్ల రక్షణ గోడలు ఛిద్రమైపోయాయి. మరికొన్ని చోట్ల వాహనాలు అదుపుతప్పితే ప్రాణాలు గాల్లో కలిసి పోవలసిందే. దాదాపు రెండేళ్ల నుంచి ఘాట్‌రోడ్డులో ఎటువంటి నిర్వహణ, అభివృద్ధి పనులు చేపట్టలేదు. అనేక మంది వ్యాపార నిమిత్తం ఈ ఘాట్ రోడ్డులో వెళతుంటారు. అయితే.. రక్షణ చర్యలు లేకపోవడం వల్ల ఈ మార్గంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ప్రమాదకర మలుపు వద్ద దెబ్బ తిన్న రక్షణ గోడ


వర్షాలకు కంకర తేలిన ఘాట్ రోడ్డు

C.R.I.M.E N.E.W.S

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● యువకుడి మృతి.. మరొకరికి గాయాలు


మృతి చెందిన వెంకటేశ్వర్లు (ఫైల్)

రాపూరు, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): వేగంగా వచ్చి కారు ఢీకొనడం తో ఒకరు మరణించగా, మరొకరు గాయపడ్డ సంఘటన రాపూరు మండలం సిద్ధవరం గ్రామ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అరుంధతి వాడకు చెందిన మాతంగి కాంతారావు, చిన్నమ్మల కుమారుడు వెంకటేశ్వర్లు (25), అతని సమీప బంధువు అంజనీ కుమార్‌తో కలిసి ఉదయం సిద్ధవరం అరుంధతి వాడ వద్ద బైకుపై ఆగి ఉండగా, వెంకటగిరి నుండి రాపూరు వైపు వస్తున్న కారు అతి వేగంతో వచ్చి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ స్థానికులు 108లో రాపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మాతంగి వెంకటేశ్వర్లు ఆస్పత్రిలో మరణించగా, అంజనీకుమార్ చికిత్స పొందుతున్నాడు. అతని తండ్రి కాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఆత్మకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చెరువులో ఆదివారం సాయంత్రం గల్లంతైన యువకుడు నలిశెట్టి మహేష్(30) మృతదేహం సోమవారం ఉదయం చెరువులో తేలియాడింది. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుని భార్య మొబీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైకుపై నుంచి పడి ఒకరికి గాయాలు

కావలి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడడంతో భానుమూర్తి గాయపడిన సంఘటన పట్టణంలోని ఉదయగిరి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సోమవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు... పట్టణంలోని తుఫాన్‌నగర్ కు చెందిన భానుమూర్తి వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో బ్రిడ్జిపై మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో గాయపడ్డ ఆయనను 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు.

ట్రావెల్స్ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం


జాతీయ రహదారిపై నిలిచిన ట్రావెల్స్ బస్సు

నెల్లూరు(క్రైం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని బుజబుజ నెల్లూరు వద్ద ఒంగోలు వైపు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు సోమవారం ఉదయం త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. గూడూరు వైపు నుంచి ఒంగోలు వైపు వేగంగా వెళుతున్న ఎస్‌వీబీటీ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సరిగ్గా బుజబుజనెల్లూరు హైస్కూల్ వద్దకు వచ్చే సరికి టైరు పేలడంతో బస్సు రోడ్డుకు అటూ ఇటూ తిరిగి పక్కన ఆగింది. ఆ సమయంలో బస్సుకు ముందు, వెనుక వాహనాలు రాకపోవడతో పెద్ద ప్రమాదమే తప్పింది. అదే ప్రాంతంలో ఎన్‌హెచ్‌ఏఐ వాహనం ఉండటంతో బస్సును ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పక్కకు తీసుకెళ్లారు. దీంతో ట్రాఫిక్‌కు పెద్దగా అంతరాయం ఏర్పడలేదు. బస్సు టైరు పేలడంతో భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు బస్సును దిగి ఇతర వాహనాల్లో గమ్య స్థానాలకు వెళ్లారు.

దొంగగా మారిన ఇంజనీర్!


నిందితుడి వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంజనీర్ దొంగగా మారాడు. బంగారు గొలుసులు, బైక్‌లు అపహరిస్తూ పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. అతని కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు సోమవారం నిందితుడుని అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు వెల్లడించారు. నెల్లూరు నగరంలోని చాకలవీధిలో ఎస్ అక్కమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా ఉంటోంది. ఆమె తన పై పోర్షన్ ఖాళీగా ఉండటంతో టూలెట్ బోర్డు పెట్టారు. ఈ ఏడాది సెప్టెంబరు 23వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి ఇంటి బాడుగ విషయమై మాట్లాడుతున్నట్లు నటిస్తూ ఆమె మెడలోని బంగారు సరుడును తెంపుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు పొదలకూరు మండలం సూరాయపాలెంకు చెందిన శ్రీనాథగా గుర్తించారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టగా చిన్నబజారు ఎస్‌ఐ అయ్యప్ప నేతృత్వంలోని బృందం సోమవారం పొగతోట ఎస్-2 థియేటర్ రోడ్డులో అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా చిన్నబజారు, బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో రెండు గొలుసు దొంగతనాలు, చిన్నబజారు, నవాబుపేట, దర్గామిట్ట పోలీసు స్టేషన్ల పరిధిలో ఏడు బైక్‌లను దొంగలించినట్లు వెల్లడించారు. దీంతో నిందితుడుని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.5.51 లక్షలు విలువ చేసే 48 గ్రాముల బంగారు గొలుసులు, ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

అప్పుల బాధ భరించలేక...

శ్రీనాథ్ బీటెక్ చదివి ప్రస్తుతం సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడిన ఆయన అప్పులపాలయ్యాడు. అప్పుల బాధలు తాళలేక దొంగగా మారాడని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తెలిపారు. నిందితుడుని అరెస్ట్ చేసి సొత్తును రికవరీ చేసేందుకు కృషి చేసిన ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఎస్‌ఐ అయ్యప్ప, సిబ్బంది గిరి, సురేష్, సుధాకర్, సతీష్, శ్యామ్, సుబ్బారావు తదితరులను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

బోగోలులో మద్యం దుకాణానికి నోటిఫికేషన్

నెల్లూరు(క్రైం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలోని బోగోలులో ఒక్క వైన్‌షాపునకు దరఖాస్తు చేసుకునేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. బుధవారం నుంచి ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారని ఈఎస్ ఏ శ్రీనివాసులునాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించి ఈనెల 12వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో లాటరీ తీసి షాపును కేటాయిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు కావలి ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న సురేష్‌కృష్ణ

విడవలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో వెలసివున్న శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రతీ సోమవారం అన్నదానం చేస్తామని ఆలయ ఛైర్మన్ అత్తిరాల సురేష్ కృష్ణ తెలిపారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ఆలయ పూజారి శ్రీకాంత్ శర్మ విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ అత్తిరాల సురేష్ కృష్ణ, టీడీపీ నాయకులు చిన్నిబాబు, పురిణి హరి, ఉదయ్, గుమస్తా వెంకటేశ్వర్లు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి సన్నాహాలు


మంత్రి ఆనంకు ఆలయ మాస్టర్ ప్లాన్ వివరిస్తున్న శ్రీనివాసులు రెడ్డి

రాపూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలోని శ్రీవారి పట్టమహిషి శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి దేవస్థాన పునర్నిర్మాణానికి సంబంధించిన ఆలయ మాస్టర్ ప్లాన్‌ను విజయవాడలోని దేవాదాయశాఖ కార్యాలయంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి సమర్పించామని ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. పెంచలకోన లో శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి దేవస్థాన పునర్నిర్మాణ కార్యక్రమానికి సంబంధించిన తేదీల ఖరారుపై దేవస్థానం ఆలయ ప్రధాన పురోహితులతో కలిసి మంత్రిని కలిసి వివరించామన్నారు. అదేవిధంగా ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సమర్పించామన్నారు. ఆలయ విస్తరణ, మండప నిర్మాణం, గర్భగుడి పునర్నిర్మాణం, ప్రాకారాలు, యజ్ఞశాల, గోపుర నిర్మాణం తదితర అంశాలను వివరించామన్నారు. అలాగే సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్) నిధుల ద్వారా ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనకు తుది ఆమోదం పొందిన అనంతరం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖాధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, పురోహితులు పాల్గొన్నారు.

పొదలకూరు.. 'చెత్త'కు మారుపేరు!


యాదవవీధిలో నిండుకున్న చెత్త

పొదలకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. పారిశుధ్య కార్మికులు, పంచాయతీ పాలకులు, అధికారులు పారిశుధ్యంపై సరిగా దృష్టి పెట్టకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని యాదవ వీధిలో వారం రోజుల నుంచి చెత్త తొలగించకపోవడంతో వీధి మొత్తం చెత్తాచెదారంతో నిండిపోయి, దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ పందులు కూడా చనిపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తుందని, ఆ వీధిలో వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిందేనని ఆవేదన చెందుతున్నారు. చెత్తను ఏ రోజుకారోజు తొలగించాలని పంచాయతీ సిబ్బందికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపో తున్నారు. ఇప్పటికైనా అక్కడ చెత్తతో పాటు, మృతి చెందిన పంది కళేబరాన్ని తొలగించాలని వారు కోరుతున్నారు.

కామాక్షమ్మ ఆలయ ఆదాయానికి శఠగోపం!

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కామాక్షిమాత ఆలయ ఆదాయానికే శఠగోపం పెడుతున్నారు కొందరు అక్రమార్కులు. భూముల వేలంలో ఆలయ ఉద్యోగి ఒకరు చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి. 2022-2023 సంవత్సరం నుంచి 2024-25 వరకు 3 ఏళ్ళ కాలపరిమితితో 2022 సంవత్సరం అక్టోబరు నెలలో నిర్వహించిన బహిరంగ వేలంపాటల్లో ఓ ఆలయ ఉద్యోగి బినామీ పేరుతో 4.41 ఎకరాల మాగాణి భూమిని ఏడాదికి రూ.1.76 లక్షలకు పాటను దక్కించుకుని ఆ మేరకు వేలం పాటలకు సంబంధించిన రికార్డుల్లో నమోదు చేశారు. 3 ఏళ్ళ కాలపరిమితి తీరిన తరువాత ఆ భూములకు 2025 అక్టోబరులో బహిరంగం వేలంపాటలు నిర్వహించారు. 2022 వేలంపాటల ప్రకారం రూ.1.76 నుంచి ప్రారంభించాల్సిన వేలంపాటను, రూ.1,16 లక్షల నుంచి మొదలుపెట్టడంతో పాటదారుల్లో అనుమానాలు రేకెత్తాయి. దీంతో అసలు తతంగం వెలుగుచూసింది. ఏడాదికి రూ.60 వేల లెక్కన 3ఏళ్ళకు 1.80 లక్షల మేర ఆలయ ఉద్యోగి ఒకరు తన చేతివాటం ప్రదర్శించి ఆలయ ఆదాయానికి గండికొట్టిన వ్యవహారం బయటపడింది. 2022లో పప్పు వెంకటరాజ పేరుతో 1.76 లక్షలకు వేలం పాట ఖరారు కాగా, గత నెల 24న తాజాగా జరిగిన వేలంపాటల్లో యర్రంశెట్టి శ్రీధర్ పేరుతో రూ. 1 లక్షా 35 వేల 50కు వేలం పాట ఖరారు చేయడం గమనార్హం. ఇలా బినామీలతో ఎక్కువ లీజుతో భూములు దక్కించుకోవడం, తరువాత రికార్డులు తారుమారు చేసి ఆలయ దాయానికి గండి కొట్టడంతో ఆ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించినట్లు స్పష్టమవుతోంది. ఈ అక్రమాలపై వేలంపాటదారులు, రైతులు ఆలయ ఈఓను నిలదీశారు. దీంతో ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి పాటను రద్దుచేసి, వారిపై చర్యలు తీసుకుంటామని ఈఓ బహిరంగంగా చెప్పారు. ఐనా నేటికీ ఆదిశగా చర్యలు లేకపోగా 4వతేదీ మంగళవారం సదరు భూమికి వేలంపాటలు నిర్వహణకు కరపత్రాలు పంపిణీతో దండోరా వేయించారు. దీంతో భూముల వేలంలో అక్రమాలపై ఆలయ కమిటీ ఛైర్మన్ అశోక్‌రెడ్డి, సభ్యుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు న్నాయి. ఈ విషయంపై ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసులురెడ్డిని వివరణ కోరగా వేలంపాటల సమాచారాన్ని డీసీబీలోకి నమోదులో జరిగిన పొరపాటని తెలిపారు.

● భూముల వేలంలో అక్రమాలు

గతేడాది జూలైలో దేవాదాయ, ధర్మాదాయ శాఖలో విజిలెన్స్ అధికారులు అప్పట్లో ఆలయంలో అక్రమాలపై సుమారు వారం పాటు చేసిన ఆలయ ఆస్తులు పరిశీలన విచారణకే పరిమితమైంది. నేటికీ నివేదిక నేటికీ వెల్లడించలేదు. కానీ ఏడాది క్రితం చేపట్టిన విచారణలోనూ రెండేళ్ళ క్రితం జరిగిన ఆలయ భూముల వేలంపాటల్లో అక్రమాలు విజిలెన్స్‌కే అంతుచిక్కలేదంటే ఇంట్లో దొంగను ఈశ్వరుడుకూడా పట్టలేడన్న చందంగా వుందని భక్తుల్లో చర్చనీయాంశం..

● అధికారుల చేతివాటం

ఏసీ స్థాయి కలిగిన కామాక్షితాయి ఆలయానికి పైరవీలతో వచ్చే ఏసీ క్యాడర్‌కు కిందిస్థాయి కార్యనిర్వహణాధికారులు డిప్యుటేషన్ పద్ధతిన ఇతర ఆలయాలనుంచి ఔట్‌సోర్స్ వుద్యోగులను జొన్నవాడకు, జొన్నవాడ నుంచి ఇతర ఆలయాలకు పంపి జొన్నవాడ ఆలయంలోనే జీతాలు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. డిప్యూటేషన్‌పై తాత్కాలిక వుద్యోగులను తీసుకొచ్చి నిబంధనలు విరుద్ధంగా వారికి పేస్కేల్ కల్పిస్తూ శాశ్వత ఉద్యోగులను చేసిన వైనం కూడా జొన్నవాడ ఆలయ అధికారులదేనని విమర్శలున్నాయి. దీంతో ఆలయ ఆదాయం హారతి కర్పూరంగా మారింది.

అక్రమ కేసులతో నిర్వాసితుల పొట్టకొట్టారు!


సమావేశంలో మాట్లాడుతున్న కార్మికుల యూనియన్ నాయకుడు రవి

ముత్తుకూరు, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమ కేసులతో నిర్వాసితుల పొట్టకొట్టడం తప్ప వైసీపీ నాయకులు చేసిందేమీ లేదని జెన్కో థర్మల్ కేంద్రం కాంట్రాక్టు కార్మికుల యూనియన్ నాయకుడు కల్తూరి రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముత్తుకూరులో సోమవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బూడిద బల్కర్ల డీవోల జారీ విషయంలో స్థానికులు తమకు ఉపాధి కల్పించమని అడగడానికి వెళితే తెలుగు తమ్ముళ్ల దౌర్జన్యం చేశారంటూ చిత్రీకరించడం దారుణమన్నారు. స్థానికుల ఉపాధి కోసం అండగా నిలబడిన మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున్‌యాదవ్ పె విమర్శ చేయడం హాస్యాస్పదమన్నారు. అప్పటి ఎమ్మెల్యే కాకాణి తమకు చేసింది ఏమీ లేదని, అన్యాయం జరుగుతుంటే కనీసం తమను పట్టించుకోలేదని రవి అన్నారు. తన స్థాయి మరచి గండవరపు సూరి విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ సురేఖ, టీడీపీ నాయకులు వాంకిలి శీనయ్య, వావిళ్ల జనార్ధన్, అక్కయ్యగారి ఏడుకొండలు, దారా యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లు నిబంధనలు పాటించాలి


సూచనలిస్తున్న శివ నాయక్

రాపూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎరువుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించి విక్రయాలు చెయ్యాలని పొదలకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శివ నాయక్ సూచించారు. మండలంలోని ఎరువులు, పురుగు మందుల డీలర్లతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎరువుల పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డీలర్లు పాటించవలసిన నిబంధనలను వారికి తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమసుందర్, డీలర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా వరప్రసాద్‌రెడ్డి

కలువాయి, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): కలువాయి మండల డిప్యూటీ ఎంపీడీవోగా సీహెచ్ వరప్రసాద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

పెండింగ్ అర్జీలపై ఎందుకింత నిర్లక్ష్యం ?

● సిబ్బందిపై తహసీల్దార్ ఆగ్రహం


సమీక్ష చేస్తున్న తహసీల్దార్ రమాదేవి

మనుబోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ తహసీల్దార్ రమాదేవి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో సోమవారం ఆమె వీఆర్వోలు, ఆర్‌ఐలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో సుమారుగా 65 అర్జీలు పెండిం గ్‌లో ఉన్నాయన్నారు. రెండునెలలుగా వాటికి పరిష్కారం చూపలే దన్నారు. అలాగే కలెక్టరేట్‌నుంచి సోమవారం 8, మనుబోలు తహసీ ల్దార్ కార్యా లయానికి 3 అర్జీలు వచ్చాయన్నారు. త్వరలోనే ఈ సమస్యలు పరిష్క రిం చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, ఆర్‌ఐ అరుణ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఏందయ్యా.. ఈ బూడిద డీవోల గోల!

● చక్రం తిప్పుతున్న జెన్కో అధికారులు
● రాయలసీమ వాసుల మాఫియా
● ఉపాధి కోసం రోడ్డెక్కిన స్థానికులు


బారులు తీరిన బూడిద బల్కర్లు

ముత్తుకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ థర్మల్ కేంద్రాలలో బూడిద వాహనాల డెలివరీ ఆర్డర్ల (డీఓ) వ్యవహారం జారీ రచ్చకెక్కింది. గత వైసీపీ ప్రభుత్వంలో మొదలైన జెన్కో అధికారుల జోక్యం, రాయలసీమ వాసుల ఆధిపత్యం చినికి చినికి గాలి వానగా మారింది. బూడిద బల్కర్లకు, టిప్పర్లకు డీఓలను జారీచేసే విషయంలో జెన్కో అధికారులు, రాయలసీమవాసులకు స్థానికంగా భూములు కోల్పోయిన నిర్వాసిత గ్రామాల స్థానికులకు మధ్య చిచ్చు రేగింది. సర్వం కోల్పోయి, ఉపాధి లేకుండా ఏళ్ళ తరబడి అల్లాడుతున్న స్థానికులు ఆదాయం వచ్చే డీఓల జారీని తమకు అప్పగించాలంటూ రోడ్డెక్కారు. ముత్తుకూరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ థర్మల్ కేంద్రాలలో వచ్చే బూడిదను సిమెంట్ ఫ్యాక్టరీలలో సిమెంట్ తయారీకి వినియోగిస్తారు. ఆయా కంపెనీలు తమకు కావాల్సిన బూడిదను సరఫరా చేసేందుకు ట్రేడర్లతో ఒప్పందం కుదుర్చుకుంటారు. ఈ ట్రేడర్లు ట్రాన్స్‌పోర్టు కంపెనీ వాహనాలకు డీఓలను జారీ చేస్తారు. ఇందుకోసం వినియోగించే ఉద్యోగుల జీతభత్యాల కోసం ప్రతి వాహనం నుంచి డీఓ జారీకి కొంత మొత్తం వసూలు చేయడం ప్రతి పరిశ్రమలో మామూలే. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడే అసలైన గేమ్ ప్రారంభమైంది. జెన్కోలో పనిచేస్తున్న కొందరు ఉన్నత స్థాయి అధికారులు రాయలసీమ నుంచి ఇక్కడకు వచ్చిన కొందరు వ్యాపారులు మాఫియాగా ఏర్పడ్డారు. తామే శాశ్వతంగా బినామీ ట్రేడర్ కంపెనీలను ఏర్పాటు చేసుకుని, ట్రాన్స్‌పోర్టేషన్ అందిస్తామంటూ లారీల యజమానులతో మాట్లాడుకుని డీఓల జారీ ప్రారంభించారు. స్థానికులు ఉపాధి కల్పించాలని కోరినా అప్పట్లో బినామీ ట్రేడర్ కంపెనీలతో కొందరు నాయకులు లోపాయికారీ ఒప్పందం చేసుకుని సర్దుకున్నారు. ఈ డీఓల జారీ స్థానికులకు ఇస్తే కొందరికైనా ఉపాధి కలుగుతుందనే చర్చ మొదలైంది.

స్థానికుల్లో మొదలైన ఆందోళన...

జెన్కో థర్మల్ కేంద్రంలో ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు తమకు వచ్చే ఆదాయాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేక స్థానికుల విజ్ఞప్తిని విస్మరిస్తూ వచ్చారు. మరో వైపు మాఫియాగా మారిన రాయలసీమవాసులు స్థానికులను ఇందులోకి ప్రవేశించకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. థర్మల్ కేంద్రాల కోసం భూములు, ఇళ్లు వదులుకున్న తమకు అన్యాయం చేస్తూ, ఎక్కడినుంచో వచ్చిన వారు జెన్‌కో థర్మల్ కేంద్రంలో ఉద్యోగాలు చేస్తున్న అధికారులు పెత్తనం సాగించడంపై స్థానికంగా మొదలైన ఆందోళన పెరిగి పెద్దదైంది. ఈ విషయంపై స్థానిక యువత సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళడంతో పాటు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివాదాస్పదంగా మారిన డీఓల జారీపై ఎమ్మెల్యే జెన్కో అధికారులతో పాటు, యాజమాన్యంతోనూ చర్చించారు. సమస్య తీవ్రం కాకముందే సున్నితంగా పరిష్కరించాలని కోరారు. తీవ్ర సమస్యగా మారుతున్న డీఓల జారీ ప్రభుత్వం దృష్టికి వెళ్ళడంతో జిల్లా ఉన్నతాధికారులను ఈ విషయమై వివరణ కోరినట్టు సమాచారం. ఇప్పటికైనా ఈ విషయంపై జెన్‌కో ఉన్నతా ధికారులు, యాజమాన్యం జోక్యం చేసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే స్థానికంగా సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉంది.

బీటీఏలో చేరిన బీవీఆర్ దంపతులు


బీటీఏలో చేరిన బీవీఆర్ దంపతులు

పొదలకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమ సీనియర్ నాయకుడు బీ వెంకటేశ్వర్లు (బీవీఆర్), అరుణ దంపతులు సోమవారం బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ ఆధ్వర్యంలో బీటీఏలో చేరారు. జిల్లాలో బీటీఏ పనితీరు, సిద్ధాంతాలు నచ్చి చేరామని, రాబోయే కాలంలో జిల్లాలో బీటీఏ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని బీవీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, ఆర్థిక కార్యదర్శి ఆదినారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లం వేణుగోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకె మనోజ్, రాష్ట్ర కార్యదర్శి రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్, మండల గౌరవ అధ్యక్షులు గౌస్‌బాషా, పొదలకూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, హజరత్, కార్యదర్శి చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల నిరసన

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో చేస్తున్న ఆందోళన కార్యక్రమం సోమవారం మూడో రోజు కొనసాగింది. ఈ నిరసనను ఉద్దేశించి జేఏసీ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శరత్‌బాబు మాట్లాడుతూ వర్క్ ఇన్‌స్పెక్టర్‌లకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఉద్యోగులందరికీ ఆటోమేటిక్ అడ్వాన్సు మెంట్ స్కీమును అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌బాబు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రబీలో 'కేఎన్‌ఎం'పై మొగ్గు!

- వరి సాగుకు తొలి ప్రాధాన్యతగా రైతుల ఆసక్తి
- రెండవ వరుసలో ఆర్‌ఎన్‌ఆర్, బీపీటీ రకాలు
- ప్రాధాన్యత కోల్పోయిన ఎన్‌ఎల్‌ఆర్

నెల్లూరురూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రబీ వ్యవసాయ సీజన్ మొదలవడంతో వరి వంగడాల ఎంపిక ప్రక్రియపై రైతులు తీవ్ర కసరత్తు చేశారు. ఎట్టకేలకు కేఎన్‌ఎం వరి రకాన్ని ఈసారి కూడా తొలి ప్రాధాన్య పంటగా సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో కేఎన్‌ఎం-1638 రకం ఇప్పటికే రైతులకు అలవాటైంది. కానీ కేఎన్‌ఎం-733, 7715 రకం మాత్రం నెల్లూరురూరల్ రైతాంగానికి కొత్తది. దీనిని జిల్లాలో పలు ప్రాంతాల్లో ఖరీఫ్, ఇటీవల ఎడగారులో సాగు చేశారు. ప్రతికూల వాతావరణంలో కూడా దిగుబడులు ఆశించిన మేరకు వచ్చాయి. పైగా సన్నరకాలు కావడంతో రైతులంతా ఆ వైపే మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో పదేళ్ల క్రితం బీపీటీ 5304, ఐదేళ్ల క్రితం ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకాలు తొలి ప్రాధాన్యత పంటగా రాజ్యమేలాయి. కానీ తాజా సీజన్‌లో రెండవ ప్రాధాన్యతకే పడిపోయాయి. ఇక ఎన్‌ఎల్‌ఆర్ 34449 రకం మూడవ వరుసలో అతి తక్కువ విస్తీర్ణానికి పరిమితమైంది. నెల్లూరుకు తూర్పు, పడమర పల్లెలో ఈసారి రబీ వ్యవసాయ సీజన్‌లో సుమారుగా 25 వేల ఎకరాలు పైచిలుకు సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే నారుమళ్ల కోసం విత్తనాలు చల్లేందుకు పంటపొలాలను బురద దుక్కులతో సిద్ధం చేస్తున్న రైతులు విత్తన వంగడాల ఎంపికలో బిజీబిజీగా ఉన్నారు. ఇటీవల ముగిసిన ఎడగారు, అంతకముందు లేట్ రబీలో



శుద్ధి కేంద్రం నుంచి విత్తనాలు తీసుకెళ్తున్న రైతులు

సాగు అనుభవాలు, దిగుబడులను నెమరువేసుకుంటున్న రైతులు ఈసారి రబీలోనూ కేఎన్‌ఎం రకాలనే సాగులో తొలి ప్రాధాన్యత క్రమం కింద తీసుకున్నారు. ఈ జాతికి చెందిన 1638 రకం ప్రతికూల వాతావరణంలోనూ చీడపీడలను తట్టుకుని ఆశించిన దిగుబడులు ఇస్తుందని రైతులు నమ్ముతున్నారు. దీనిని రెండు, మూడు సీజన్లగా సాగు చేస్తున్న అనుభవం ఉండడంతోపాటు ఇందులోనే నూతనంగా ఆవిష్కరించిన 733, 7715 రకాలు జిల్లాలో అక్కడక్కడ సాగు చేసిన అనుభవం రైతులకుంది. కానీ నెల్లూరురూరల్లో మాత్రం ఇదే తొలి సీజన్ కావడం గమనర్హం. దిగుబడులు బాగా వస్తాయని నమ్ముతున్న రైతులు ఈ రకాలను సాగులోకి తీసుకువచ్చేందుకు విత్తనాలను సమీకరిస్తున్నారు. కేఎన్‌ఎం రకం ఎప్పుడు లేనంతగా ఎడగారులోనే నాలుగు పుట్ల వరకు దిగుబడని అందించడంతో ఇక అనుకూలమైన రబీలో అంతకు మించి దిగుబడులు వస్తాయని అన్నదాతలు లెక్కకడుతున్నారు.

● రెండవ స్థానంలో బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్

సరిగ్గా పదేళ్ల క్రితం నెల్లూరురూరల్ ప్రాంతంలో ఏ రైతు నోటి నుంచైన బీపీటీ రకం తప్ప మరో వంగడం పేరురాలేదు. దీనిని తొలి ప్రాధాన్యంలో కొన్నేళ్ల పాటు సాగు చేశారు. ఆ తరువాత ఐదేళ్ల క్రితం ఆర్‌ఎన్‌ఆర్ రకం అదే స్థాయిలో తొలి ప్రాధాన్యత వరుసలో నిలిచి మరికొన్నేళ్లు రాజ్యమేలింది. ఈ రెండు రకాలు వరుసలుగా కొన్ని సీజన్ల పాటు సువ్వా... నేనా అంటూ రైతులకు అలవాటైన వంగడాలుగా మారాయి. ఇటీవల మూడేళ్లగా కేఎన్‌ఎం రకం రైతులకు బాగా దగ్గరైంది. ప్రతికూల వాతావరణంలోనూ తట్టుకుని చీడపీడలను ఎదుర్కొని, దిగుబడులు ఇస్తుండటంతో ఈ వంగడాలనే రైతులు తొలి ప్రాధాన్యతగా ఎంచుకుంటున్నారు. పదేళ్ల క్రితం నెల్లూరు ఏఆర్‌ఎస్‌లో పురుడుపోసుకున్న ఎన్‌ఎల్‌ఆర్ 34449 మంచి ఆదరణ పొందింది. కానీ తాజా సీజన్‌లో మాత్రం చాలా తక్కువ విస్తీర్ణంలో సాగుకానుండడం విశేషం.

న్యూస్ బాక్స్

'మైపాడు' ఘటనలు పునరావృత్తం కాకూడదు

● విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

నెల్లూరు(క్రైం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మైపాడు బీచ్‌లో జరిగిన దురదృష్టకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మెరైన్ పోలీసు ఇంచార్జి అధికారి, విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి మెరైన్ పోలీసులను ఆదేశించారు. సోమవారం మెరైన్ పోలీసు అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ మైపాడు బీచ్‌లో ముగ్గురు బాలురు చనిపోవడం బాధాకరమన్నారు. బీచ్ వద్ద 9 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో ఉన్నా పోలీసు సిబ్బందికి సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో మునుగుతూ ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈనెల 5వ తేదీ కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని అన్ని బీచ్‌లలో తగినంత మంది బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సముద్ర స్నానాలకు వచ్చే సందర్శకులు పోలీస్ బందోబస్త్‌లో ఉన్న ప్రదేశంలో వారి సూచనలను అనుసరించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా చూసుకోవాలన్నారు.

ఈతకు వెళ్లి మృతి చెందిన బాలురుకు నివాళి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మైపాడు బీచ్‌కు ఈతకు వెళ్లి మృతి చెందిన హుమాయూన్, సమీద్‌ల పార్థివదేహాలకు కోటమిట్టలోని వారి నివాసాల వద్ద వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చేర్మన్ అబ్దుల్ అజీజ్ సోమవారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దర్ఘటనతో తీవ్ర మానసిక వేదనకు లోనయ్యానన్నారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని, వారి కుటుంబాలకు ధైర్యం కలగాలని దేవుడును ప్రార్థిస్తున్నానన్నారు. ఆయనతో పాటు జాఫర్ షరీఫ్, మైనుద్దీన్, సమీ హుస్సేనీ, ఇంతియాజ్, కాలేషా, ఖలీల్ తదితరులు ఉన్నారు.

భవనం పైనుంచి పడి ఒకరి మృతి

నెల్లూరు(క్రైం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనం నాల్గవ అంతస్థుపై నుంచి పడి టైల్స్ కార్మికుడు మృతి చెందిన ఘటన సోమవారం నగరంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలంలోని కొండాయపాలెం గంగోత్రినగర్‌లో మొలకల కమలాకర్ రెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయన నగరంలోని లీలామహల్ థియేటర్ సమీపంలోని సీఆర్ రెడ్డి వైద్యశాల స్థానంలో నూతనంగా నిర్మిస్తున్న భవనానికి సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. ఆ భవనంలోని టైల్స్ పనులు చేసే కాంట్రాక్టును బెంగాలికి చెందిన బాదుషాకు ఇచ్చారు. దీంతో ఆ భవనంలో పలువురు బెంగాలికి చెందిన వారు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం నాల్గవ అంతస్థులో పనిచేస్తున్న సజల్ మహతా ప్రమాదవశాత్తు కిందపడాడు. అక్కడే పనిచేస్తున్న వారందరు హుటాహుటిన చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందారని నిర్ధారించారు. బిల్డింగ్ సూపర్‌వైజర్ కమలాకలర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్థం నిమిత్తం మార్చురీకు తరలించారు.

సైబర్ నేరాలపై అవగాహన

నెల్లూరు(విద్య), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం, మహిళల అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సెట్నల్ సీఈవో నాగేశ్వరావు మాట్లాడుతూ యువత సామాజిక దుష్ప్రవర్తనలకు దూరంగా ఉండి సురక్షితమైన డిజిటల్ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు ఆత్మ నియంత్రణతో సామాజిక బాధ్యతలు గుర్తెరిగి నడుచుకోవాలన్నారు. సైబర్ నేరాలు, ఇతర చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవడంతో పాటు క్రమశిక్షణ కలిగిన జీవనంతో ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. అనంతరం పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ మేనేజర్ శ్రీనివాసరావు, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ వై.శ్రీహరి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.హజరత్తయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.చంద్రమోహన్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు వృద్ధుల నేత్రదానం

నెల్లూరు(వైద్యం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇద్దరు వృద్ధులు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. నగరంలోని కుక్కలగుంటకు చెందిన అరణి వెంకయ్య(75), చంద్రమౌళినగర్‌కు చెందిన తిర్లంకి గరికయ్య (65) సోమవారం మృతి చెందారు. వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో మృతుల నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన టెక్నీషియన్ సునీల్ సేకరించారు. కుటుంబ సభ్యులకు నేత్రదాన గుర్తింపు పత్రాలు అందచేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి



గరుడ వాహన సేవలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలో ని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం తిరుమంజనం, విశేష పూజలు నిర్వహించారు. రాత్రి గరుడ వాహన సేవ మాఢవీదుల్లో కనుల పండువగా జరిగింది. భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. గోవిందనామ స్మరణలు ఆలయం మారుమోగాయి.

రెప్కో బ్యాంకులో లోన్‌మేళా



జ్యోతిప్రజ్వలన చేసి లోన్‌మేళాను ప్రారంభిస్తున్న బ్యాంకు ఏజీఎం జయచంద్రన్, బ్యాంకు అధికారులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : రెప్కో బ్యాంకు మార్టిగేజ్ లోన్‌మేళాను ఆ బ్యాంకు ఏజీఎం జయచంద్రన్ సోమవారం నగరంలోని ఆ బ్యాంకులో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జయచంద్రన్ మాట్లాడుతూ వినియోగదారులకు అన్ని రకాల సేవలను రెప్కో బ్యాంకు అందిస్తుందని తెలిపారు. ఈ లోన్‌మేళా డిసెంబరు 9వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. చీఫ్ మేనేజర్ రవి కిషోర్ మాట్లాడుతూ స్థిరాస్తి తనఖాపై అతి తక్కువ వడ్డీతో, ప్రాసెసింగ్ ఫీజులో 50శాతం రాయితీతో రూ.2లక్షల నుంచి రుణం పొందవచ్చని తెలిపారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీని తమ బ్యాంకు ద్వారా అందచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నెల్లూరు(విద్య), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అరుణాచల్ ప్రదేశ్ ఐతానగర్‌లో ఈనెల 22 నుంచి 31వ తేదీ వరకు జరిగే 42వ జాతీయ సబ్‌జూనియర్ ఆర్చరీ పోటీలకు జిల్లా క్రీడాకారులు పీ.రాజేష్, కే.తరుణీష్‌జాత్యాలు ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణులు తెలిపారు. సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర సబ్‌జూనియర్ బాలుర రికర్వ్‌రౌండ్‌లో .రాజేష్ ప్రథమ, తరుణీష్‌జాత్యా తృతీయస్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. జాతీయ పోటీల్లో కూడా ప్రతిభ చూపి పతకాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు టీ.శివశంకర్, జయశంకర్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాయపుపాలెంలో వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాయపుపాలెంలో కృపారిలీఫ్ మినిస్ట్రీస్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎల్‌వీ ప్రసాద్ వైద్యశాల డాక్టర్‌లు విచ్చేసి స్థానికులకు కంటి, గుండె, వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ట్రస్ట్ డైరెక్టర్‌లు దారా కృపావతి, సునీల్‌కుమార్‌లు తమ ట్రస్ట్ నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మహాదీపోత్సవానికి తరలిరండి

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఘాట్ వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం జరగనున్న కార్తీక మహాదీపోత్సవానికి నగర ప్రజలందరూ రావాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన గణేష్‌ఘాట్‌లో ఏర్పాట్లను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, సింహపురి కార్తీక దీపోత్సవ సమితి సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఆరోజు సాయంత్రం 5 గంటలకు మహిళలతో శోభాయాత్ర, 6గంటలకు హరిద్వార్ నుంచి వచ్చిన పురోహితులతో గంగాహారతులు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాలకు అన్ని రాజకీయ పార్టీలు, భక్తసేవా సమితిలు సంఘీభావ తెలపాలని కోరారు. ఈ సందర్భంగా 108 పడవలతో శివాకృతి అలంకారం స్వర్ణాల చెరువులో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు వెన్నెల, ప్రధాన కార్యదర్శి మల్లిక, ఉపాధ్యక్షురాలు జయప్రదమ్మ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కోడూరు జయరాం, ఏవీఆర్ మోహన్‌రావు, రఘునాథరాజు, జనార్దన్‌రాజు, మండ్ల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం ఉధృతం

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాసర్



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నాసర్

నెల్లూరు(విద్య), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై పోరాటాలను ఉధృతం చేస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాసర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై జరుగుతున్న బస్సుయాత్రలో భాగంగా సోమవారం నెల్లూరులోని అనిత హాలులో జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక నేటికీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్ల విడుదల చేయకపోవడంతో ఆయా కళాశాలల్లో విద్యార్థులు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణను వ్యతిరేకించిన విద్యాశాఖ మంత్రి ప్రస్తుతం ప్రైవేటీకరణ వైపు అడుగులు వేయడం ఏమిటని ప్రశ్నించారు. పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులు పడే బాధలు ప్రభుత్వానికి కనిపించకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా కళ్లు తెరిచి వారి ఇబ్బందులను తొలగించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు, యూనివర్శిటీల్లో ఖాళీగా ఉన్న బోధన పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, సహాయ కార్యదర్శులు స్వామి, నాగభూషణం, ఆంధ్ర యూనివర్శిటీ కార్యదర్శి అభి, జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్, నాయకులు సుమన్, చరణ్ పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలి

● పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సీపీఎం నేతల వినతి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న సీఎంఎం నేతలు

నెల్లూరు(వైద్యం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని బుజబుజ నెల్లూరులో వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి వినియోగంలోకి తేవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సీపీఎం నేతలు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ బుజబుజనెల్లూరులో 25 వేల మంది ప్రజలు ఉన్నారన్నారు. ఇక్కడ ఉన్న వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేయకపోవటంతో ఒక్కో కుటుంబంపై నెలకు రూ.1200 ఖర్చవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు నందిపాటి మాల కొండయ్య, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రవి, సురేంద్ర, ఈశ్వరయ్య, రఫీ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవ రోగులకు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

జిల్లాలో నెట్‌వర్క్ ఆసుపత్రుల సమ్మెలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద చికిత్సకు డబ్బులు చెల్లించిన రోగులకు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షుడు సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద బకాయిలు చెల్లించలేదని నెట్‌వర్క్ ఆసుపత్రులు 21 రోజులు సమ్మె చేశారని, ఈ నేపథ్యంలో వ్యాధుల కింద పలువురు రోగులు ఎన్టీఆర్ వైద్య సేవ కింద అర్హత ఉన్నప్పటికీ డబ్బులు చెల్లించి చికిత్సలు చేయించుకున్నారనాన్నరు. బాధితుల చికిత్సలకు సంబంధించి ఖర్చులు తిరిగి చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఇర్ఫాన్, అమర్నాథ్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆశ పెట్టి.. ముంచేశారు!

(5వ పేజీ తరువాయి)

రుణాలను అందిస్తామంటూ తమ నిబంధనలు అనుసరించి సాధారణ రిజిస్ట్రేషన్ పొందిన లబ్ధిదారులకు మాత్రమే రుణాలను అందిస్తున్నారు. ఓటీఎస్ పత్రాలను దరిదాపులకు కూడా రానివ్వడం లేదు.

● ససేమీరా అంటున్న రిజిస్ట్రేషన్ శాఖ

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలు తమ ఇళ్లపై రుణాలను పొందాలనే ఉద్దేశంతో ఓటీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న పత్రాలను పక్కనపెట్టి సాధారణ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో సంప్రదిస్తున్నారు. సంబంధిత అధికారులు లబ్ధిదారుల పేర్లపై ఆన్‌లైన్‌లో పరిశీలించి వారు చేయించుకోవాలనుకున్న ఆస్తి ఇదివరకే ఓటీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ అయిపోయిందని, నిబంధనల ప్రకారం మరోసారి రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు పడదని, ఓటీఎస్ ద్వారానే రుణలు పొందాలని తేల్చిచెబుతున్నారు. ఓటీఎస్ రిజిస్ట్రేషన్ పత్రాలపై రుణాలు ఇవ్వమంటే ఫైనాన్స్ కంపెనీలు ససేమీరా అంటున్నాయి. దీంతో ఇటు చెంపదెబ్బ, అటు గోడదెబ్బ అన్న చందంగా పేద, మధ్య తరగతి ప్రజల పరిస్థితి మారింది.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కు 78 వినతులు



అర్జీని పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు నగర వాసుల నుంచి 78 వినతులు అందాయి. పారిశుధ్యం, సిటీ ప్లానింగ్, రెవెన్యూలతో పాటు వివిధ సమస్యలపై నగర పౌరులు తమ అభ్యర్థనలను తెలియచేశారు. వాటిని స్వీకరించిన కమిషనర్ నందన్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన వినతులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఖాళీ స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని, వాటిల్లోని నీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాలువలపై అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని తెలిపారు. అనంతరం కమిషనర్ నందన్‌ను తోటి ఉద్యోగులు సన్మానించారు. ఇటీవల సీఎం చేతులు మీదుగా మొంథా సైక్లోన్ ఫైటర్ ప్రశంసను అందుకున్నందున శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు విభాగాలతో సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా నగరంలోని పలు డివిజన్లలో పర్యటించిన కమిషనర్ పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మాదక ద్రవ్యాల వినియోగంపై పోరాటం

● డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా నరసింహ, రమణ



డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ

నెల్లూరు(వైద్యం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగంపై యువత చెడుద్రోవ పటకుండా పోరాటం చేస్తామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీ.నరసింహ, ఎంవీ రమణ తెలిపారు. సోమవారం నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన డీవైఎఫ్ఐ 21వ మహాసభలో నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బీ.నరసింహ, ఎంవీ రమణతో పాటు జిల్లా ఆఫీసు బేరర్లుగా జగదీష్, చైతన్య, నరసింహ, సురేష్, ఓంకార్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఎదుర్కొంటున్న పలు సమస్యలలో ప్రధానంగా నగరంలో మాదక ద్రవ్యాల వినియోగం ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలో భాగంగా నిరుద్యోగుల భృతి రూ.3వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక పరిశ్రమలలో యువతకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని తీర్మానం చేయాలన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చెయ్యాలని కోరారు.

రూ.70 కోట్లతో రోడ్ల నిర్మాణం

● టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి పార్టీల ప్రభుత్వం ఏర్పడ్డాక నెల్లూరురూరల్ నియోజకవర్గంలో రూ.70 కోట్లతో రహదారులు నిర్మించామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కందమూరు, ఉప్పుటూరు గ్రామాల మధ్య రూ.2.65 కోట్లతో నిర్మిస్తున్న రహదారి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన రహదారులతో పాటు గ్రామాల మధ్య లింకురోడ్లుతో సహా నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రయాణ సౌకర్యం, ప్రమాదాల నివారణకు ప్రాధాన్యతనిస్తు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నిధులను సమీకరించారని చెప్పారు. రూరల్ అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తున్న ఎంసీ చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, చక్రవర్ధన్‌రెడ్డి, జలదంకి సుధాకర్, రాపూరు పెంచలయ్య, సర్పంచు పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకులు గృహిణులే!

● నగర కమిషనర్ నందన్



మహిళలను సన్మానిస్తున్న కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్దేశకులు గృహిణులేనని, వారి కృషిని అందరం అభినందించాలని నగర కమిషనర్ వై.నందన్ తెలిపారు. సోమవారం రాత్రి బాలాజీనగర్ వికాస్ హైస్కూల్‌లో వికాస్ ప్రజాహిత సేవా సమితి అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ గృహిణి (మహిళ) దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ కార్యక్రమానికి కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై మహిళలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలు 50 మందిని సన్మాంచి బహుమతులు అందజేశారు. జాతీయ గృహిణుల దినోత్సవం సందర్భంగా మహిళలకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ శుభాకాంక్షల సందేశాన్ని పంపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జీ.మాధురి, సిటీ ప్లానర్ కట్టా హిమబిందు, డాక్టర్ సహజ, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ నెంబర్ లాటరీపై పోలీసుల దాడి



నిందితుల వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ సోమయ్య

నెల్లూరు(క్రైం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింగల్ నెంబర్ లాటరీపై సంతపేట పోలీసులు సోమవారం దాడులు చేశారు. నిందితుల వివరాలను సంతపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య వెల్లడించారు. సిరి థియేటర్ సమీపంలోని కతారిపాలెంలో సింగల్ నెంబర్లాట జరుగుతోందని ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్యకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. సింగల్ నెంబర్ లాటరీ రాస్తున్న కతారిపాలెంకు చెందిన కే.చిన్న, సంతపేట బుజ్జమ్మ రేవుకు చెందిన గంగాధర్‌లతో పాటు సింగల్ నెంబర్ ఆడుతున్న నిప్పో సెంటర్‌కు చెందిన షేక్.పెద్దనాగూర్, రంగనాయకులపేటకు చెందిన షేక్ జమీర్, జెండావీధికి చెందిన షేక్ అమీన్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10,190 స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథా నాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్స్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది



దీక్షిత్ శెట్టి

విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.

'డయల్ యువర్ సీఎండీ'లో ఫిర్యాదులు

నెల్లూరు(జడ్పీ), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎస్పీడీసీఎల్ పరిధిలో డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు నుంచి పలువురు సమస్యలు తెలియజేసినట్లు సీఎండీ శివశంకర్ తెలిపారు. గృహాలపై విద్యుత్ తీగలు, వ్యవసాయ కనెక్షన్లు, విద్యుత్ లైన్ల మార్పు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగతనాలు తదితర సమస్యలపై ఫిర్యాదులు డయల్ యువర్ సీఎండీకి ఫిర్యాదులు వచ్చాయని, వాటన్నింటిని వెంటనే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. దీంతో పాటు టోల్‌ఫ్రీ నెంబర్లు 1912 లేదా 1800425, 155333కు వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. అలాగే 9133331912 వాట్సాప్ నెంబర్‌కు వినియోగదారులు ఫిర్యాదులు చేయవచ్చునని ఆయన తెలిపారు.

పోలీసు పీజీఆర్ఎస్ వేదిక మార్పు

● అర్జీలు ఇచ్చేందుకు బాధితుల అవస్థలు ● క్యూలో నిల్చోలేక ఇక్కట్లు

నెల్లూరు(క్రైం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో గత సోమవారం పోలీసు పీజీఆర్ఎస్ రద్దయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం వందలాది మంది తరలి వచ్చారు. అయితే అలవాటు ప్రకారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ వద్దకు భారీగా బాధితులు చేరుకున్నారు. అక్కడ ఎలాంటి ఏర్పాటు కన్పించకపోవడంతో గ్రీవెన్స్ ఉందా... లేదా..? అని అక్కడున్న పోలీసు సిబ్బందిని ప్రశ్నించారు. 'ఉంది.. ఉంది.. పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్నారు.. అక్కడికి వెళ్లండి'.. అని సమాధానం ఇచ్చారు. వేదిక మార్పు చేయడంతో అప్పటికే చాలామంది వెనుతిరిగారు.



అర్జీదారు నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల, క్యూలో నిల్చొని ఉన్న బాధితులు

● సరిపోని ఏర్పాట్లు

జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్‌ను సోమవారం నిర్వహించారు. అయితే పోలీసు కార్యాలయంలో చేసిన ఏర్పాట్లు బాధితులకు ఏ మాత్రం సరిపోలేదు. కార్యాలయం బయట టెంట్లు ఏర్పాట్లు చేసి, డీఎస్పీలు వినతులు స్వీకరించారు. ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల కార్యాలయానికి వచ్చిన తర్వాత టెంట్ల నుంచి కార్యాలయం లోపల ఫిర్యాదులు స్వీకరించేలా చర్యలు చేపట్టారు. కార్యాలయం లోపల అప్పటికప్పుడు ఏర్పాట్లు చేయడం, బయట ఫిర్యాదులు స్వీకరించడం నిలిపి వేయడంతో బాధితులు గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది.కాగా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసే బాధితులు క్యూలో నిలబడలేక అవస్థలు పడ్డారు.

వారం వారం.. అర్జీదారుల జాతర

● సమస్యలు యథాతథం ● పరిష్కారానికి పడిగాపులు



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి సమస్యలు పరిష్కరించాలని పెద్దసంఖ్యలో ప్రజలు వారంవారం కలెక్టరేట్‌కు పోటెత్తుతున్నారు. భూసమస్యలు, ఇళ్ల స్థలాలు, భూములు కావాలని, రేషన్‌కార్డులు, పెన్షన్లు ఇప్పించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తిచెందేలా ప్రతీ అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై దృష్టిపెట్టి మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. ఏ శాఖ పరిధిలోనూ వినతులు పెండింగ్‌లో ఉండరాదన్నారు. సమస్యను పరిష్కరించలేకపోతే ఎందుకు పరిష్కరించలేక పోతున్నామో ప్రజలకు తెలియచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం. వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అందిన అర్జీల్లో కొన్ని...

● తనకు ఇస్తున్న దివ్యాంగ పింఛన్‌ను రూ.6వేల నుంచి రూ.15లకు పెంచాలని ఊటుకూరుకు చెందిన వెంకటరమణమ్మ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

● బుజబుజనెల్లూరులోని వాటర్‌ప్లాంటును పరిశీలించి న్యాయం చేయాలని సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆలూరు తిరుపాలు, నందిపాటి మాలకొండయ్య, కే. కృష్ణమూర్తి,డీ. వెంకటేశ్వర్లు, టీ. శ్రీనివాసులు, టీ. రవి, సరేంద్ర, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

● దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకుడు జీవీ. రమణయ్య వినతిపత్రం సమర్పించారు. పాత పద్ధతిలోనే పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

● దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌పై విచారణ జరపాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

● వాటర్ ప్లాంటుకు మరమ్మతులు చేయించాలని నగరంలోని 25వ డివిజన్ ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

● తమ భూమిలోకి రానివ్వకుండా మనోజ్ అనే వ్యక్తి అడ్డుకుంటున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని దగదర్తి మండలం వెలుపోడుకి చెందిన దొరసానమ్మ, వంకదారి బాదుల్లా వినతిపత్రం సమర్పించారు.

ధర్తీ ఆబా పథకం కింద గ్రామాలాభివృద్ధి : ఐటీడీఏ పీవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో మల్లికార్జునరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తీ ఆబా పథకం కింద జిల్లాలోని 21 గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తామని ఐటీడీఏ పీవో బీ. మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని ఐటీడీఏ కార్యాలయంలో జ నజాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్తీ ఆబా పథకం కింద జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆమోదం లభించిన వెంటనే మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపడతామన్నారు. గిరిజనుల సంక్షే మం కోసం జిల్లాలో ఐటీడీఏ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడతున్నామని ఆయన వివరించారు.

వేదగిరిపై ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చక బృందం

వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. విష్వక్సేన పూజతో మొదలై విశేష పూజల అనంతరం యాగశాలలో కుంభారాధన, కర్తహోమం, అగ్ని ప్రణయణం అనంతరం సర్వ గాయత్రీ హోమం, మహా పూర్ణాహుతి, యాత్రాదానం, అక్షతారోపణతో సుదీర్ఘంగా చేపట్టిన పవిత్రోత్సవాలు ముగిస్తున్నట్లు అర్చక బృందం ప్రకటించింది. అనంతరం క్షేత్రానికి వచ్చిన భక్తజనానికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏడాదికి ఒక్కసారి వేద పండితులతో శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ వేడుకలు అత్యంత ప్రత్యేకమైనవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఆలయ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి దంపతులు, ఈవో గోపి, ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

- నెల్లూరురూరల్ (ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు కాకర్ల, ప్రశాంతిరెడ్డి తదితరులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా సీఎం చంద్రబాబు నియోజకవర్గాలకు సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసి అభివృద్ధికి బాటలు వేస్తున్నారని, ఆయన స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వీపీఆర్ ఫౌండేషన్ అధినేత, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం రామాపురంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ నేత్ర కార్యక్రమాన్ని ఉదయగిరి, కోవూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ తాను చేపట్టే కార్యక్రమాలను ఉదయగిరి నుంచి ప్రారంభిస్తే విజయవంతం అవుతాయనే ధృడ నమ్మకం ఉందన్నారు. ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకొని ఉచితంగా కంటి అద్దాలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తుల్లో కాకర్లతో కలిసి ఈ ప్రాంతానికి వెలుగొండ, సోమశిల హైలెవల్ కెనాల్ నుంచి తాగు, సాగు నీటిని తీసుకొచ్చి ఉదయగిరిని సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్, ట్రై సైకిళ్లను బాధితులకు అందజేశారు. అనంతరం కంటి వ్యాధితో బాధపడుతున్న బాధితులకు పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, టీడీపీ నేతలు చంచలబాబు యాదవ్, చంద్ర మధుసూదనరావు, మహేష్, నక్కలగండి చైర్మన్ వేమూరి మధు, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, శ్రీకాంత్ యాదవ్, నాదెండ్ల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ఉరవకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఉరవకొండ ఎంఈఓ రమాదేవి పేర్కొన్నారు. సోమవారం అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలోని సెంట్రల్ ఉన్నత పాఠశాలలో ఏపీ స్కూల్ గేమ్స్‌లో భాగంగా రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలు నిర్వహించారు. పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో అండర్ -19 బాలురు, బాలికల విభాగంలో అనంతపురం, కృష్ణా జిల్లాలు తలపడగా కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో అనంతపురం, కృష్ణా జిల్లాలు తలపడగా కృష్ణా జిల్లా జట్టు విజయం దక్కించుకుంది. అండర్-14 విభాగంలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జట్లు తలపడగా.. తూర్పు గోదావరి విజయం సాధించింది. బాలికల విభాగంలో నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లాల జట్లు తలపడగా.. నెల్లూరు విజయం సాధించింది. గెలుపొందిన క్రీడాకారులకు ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, సత్యనారాయణ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మారుతి ప్రసాద్, పీఈటీలు రాఘవేంద్ర, నాగరాజు, నాగేంద్ర, హలీమా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరం ప్రారంభం

వింజమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ లేకపోవడం ద్వారా ప్రభుత్వ పథకాలు అందకుండా ఎవ్వరూ ఇబ్బందిపడకూడదనే ఉద్దేశ్యంతో ప్రత్యేక ఆధార్ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీసీ సూపర్‌వైజర్ తేజస్వి, డిప్యూటీ ఎంపీడీవో రామారావు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11619
వెండి కిలో ధర	రూ. 153100
వెండి ఒక గ్రాము	రూ. 159.10

న్యూస్ బాక్స్

రైతులకు విత్తనాలు, యూరియా అందించాలి


ఏవోకి వినతిపత్రం ఇస్తున్న నేతలు

అనంతసాగరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొదటి పంటకు సిద్దంగా ఉన్న రైతులకు త్వరగా విత్తనాలు, యూరియా సబ్సిడీతో అందించాలని సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏవో శైలజాకుమారిని కలసి వినతిపత్రం అందించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

ఉదయగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లి గ్రామంలో పంచాయతీ భవనం, షాదీమంజిల్ నిర్మాణానికి సోమవారం వీఆర్వో బిల్లుపాటి వెంకటేశ్వర్లు, విలేజ్ సర్వేయరు అంబటి మహేష్‌లు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి రూ.32 లక్షలతో పంచాయతీ భవనం, రూ.40 లక్షలతో షాదీమంజిల్ మంజూరయ్యారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతే 167-బీజీ జాతీయ రహదారికి సమీపాన మసీదు ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సయ్యద్ జాఫర్ జమ్మత్‌బేగం, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కిల్ కాంపిటేషన్


స్కిల్ కాంపిటేషన్‌లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆత్మకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం స్కిల్ కాంపిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు బ్యూటీ, వెల్నెస్, రిటైల్ ట్రేడ్లకు సంబంధించిన స్కిల్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ అనంతలక్ష్మీ, ఇన్‌చార్జ్ మాధవరావు, ఒకేషనల్ ట్రైనర్లు జి యజ్ఞా, ఎస్ వెంకటేశ్వర్లు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురుగు కాలువలో పూడికతీత ప్రారంభం


మురుగు కాలువలో ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీయిస్తున్న అధికారులు

సంగం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జండాదిబ్బ గ్రామంలో ఉన్న మురికినీటి కాలువలో పూడికతీత పనులు సోమవారం చేపట్టారు. గ్రామం మధ్యంలో ఉన్న మురికికాలువ పూడిపోయి మురికినీటితోపాటు వర్షపునీరు వెళ్లడంలేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు, పందులకు నిలయంగా మారిందని స్థానిక టీడీపీ నాయకులు మంత్రి ఆనం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో పంచాయతీ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో మురికి కాలువలో పూడికతీత పనులు ప్రారంభించారు.

కలువాయి డిప్యూటీ ఎంపీడీవోగా వరప్రసాద్‌రెడ్డి

కలువాయి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలువాయి మండల డిప్యూటీ ఎంపీడీవోగా సీహెచ్ వరప్రసాద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లాలో గ్రేడ్-1 పంచాయతీ సెక్రెటరీగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.


ఆత్మకూరు: ప్రత్యేక అలంకారంలో విశ్వేశ్వరస్వామి


ఉదయగిరి శివాలయంలో ప్రత్యేక అలంకరణలో పరమేశ్వరుడు


వరికుంటపాడులో ప్రత్యేక అలంకరణలో మహాశివుడు


సీతారామపురం: భైరవకోనలో ప్రత్యేక అలంకరణలో పరమేశ్వరుడు

శివనామ స్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

ఆత్మకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా ఆత్మకూరులోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాస దీక్ష చేపట్టి సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించి దీక్ష విరమించారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి, కన్యకా పరమేశ్వరి, అలఘునాథస్వామి ఆలయాల్లో కార్తీక పూజలు నిర్వహించారు. శివాలయంలో అయ్యప్ప భక్తులు భజనలు చేశారు.


సంగం:సంగమేశ్వరాలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు

● **ఉదయగిరి:** పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయంతోపాటు మండలంలోని గండిపాళెం, అప్పసముద్రం, గుడినరవ, లింగాలదొన క్షేత్రం, యర్రబల్లిగడ్డ, ఆర్లపడియ గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టి కార్తీకదీపాలు వెలిగించారు. ఆయా ఆలయాల్లో అర్చకులు స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల సౌకర్యార్థం పలు ఆలయాల్లో నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు.

● **సంగం:** స్థానిక సంగమేశ్వరాలయంలో కార్తీక మాసం రెండవ సోమవారం పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. ఈసందర్భంగా ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు. అదేవిధంగా వంగల్లులోని భీమేశ్వరాలయం, దువ్వూరులోని కోటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

● **సీతారామపురం:** మండలంలోని భైరవకోన, ఘటిక సిద్దేశ్వరం, సీతారామపురంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శివయ్యకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు.

● **వరికుంటపాడు(ఉదయగిరి రూరల్):** స్థానిక శివాలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పలు గ్రామాల ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపూరు గ్రామంలో సీతాలక్ష్మణ హనుమాన్ సమేత కోదండస్వామి వార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం సోమవారం వైభవంగా ముగిసింది. ఉదయం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, సీఎ జి గంగాధర్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీనివాసులునాయుడు, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

ఉదయగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిలిపివేయాలని పట్టణంలోని బీసీ కాలనీలో సోమవారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దస్తగిరిఅహ్మద్, ఎంఏ సలీం, షంషీర్, గోగుల రామయ్య, బికారిసాహెబ్, పెంచలయ్య, రాము, మున్నా తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన డీ లక్ష్మీదేవి అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న మానవతా సంస్థ ప్రతినిధులు సోమవారం ఆమె కుమార్తె మణి చందనకు రూ. 5వేలు అందజేశారు. అలాగే ఉపాధ్యాయులు మరో రూ. 5వేలు అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి


ఆర్డీవో పావనికి సమస్య విన్నవిస్తున్న సీపీఎం నాయకులు, కాలనీవాసులు

ఆత్మకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పారావుపాళెంలో శ్మశానానికి స్థలం కేటాయించాలని సీపీఎం రూరల్ కమిటీ బాధ్యులు గంటా లక్ష్మీపతి సోమవారం దళిత వర్గాలతో కలిసి ఆర్డీవో బి పావనికి వినతిపత్రం అందజేశారు. శ్మశానస్థలం లేకపోవడంతో తుపాను సమయంలో మరణించిన వారి మృతదేహాలను అంతిమ సంస్కారాలు లేకుండానే పెన్నానదిలో పారవేయడం జరుగుతోందని, ఇకనైనా అధికారులు స్పందించి శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు లక్కు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

లింగసముద్రం, నవంబరు, 3(ఆంధ్రజ్యోతి): విత్తనాల దుకాణాల డీలర్లు అధిక దలరకు విత్తనాలను విక్రయిస్తే లైసెన్సు రద్దుకు చర్యలు తీసుకుంటామని కందుకూరు ఇన్‌చార్జ్ వ్యవసాయ సహాయ సంచాలకులు శేషారెడ్డి హెచ్చరించారు. సోమవారం లింగసముద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటసాయి సీడ్స్ దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి సీహెచ్‌వి ఎల్ దుర్గతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దుకాణంలోని విత్తన నమూనాలను సేకరించి విత్తన పరీక్షకు పంపిస్తామన్నారు. విత్తనాల డీలర్లు అందరూ స్టాక్ రిజిష్టర్లను నవీకరణ చేసుకోవాలన్నారు. విత్తనాలను కొన్న రైతులకు తప్పనిసరిగా రసీదులను అందించాలన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం : ఎమ్మెల్యే కాకర్ల


శ్రీనివాసులుకు సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

సీతారామపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కాకర్ల సురేష్ అన్నారు. సీతారామపురం మండలం దేవమ్మ చెరువు గ్రామ మాజీ సర్పంచ్ భూమయ్యగారి శ్రీనివాసులుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ2,76,817 చెక్కును ఎమ్మెల్యే కాకర్ల వింజమూరులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాటా డుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని అన్నారు. ఈకార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మండల కన్వీనర్ చెన్నకేశవులు, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి జాషువా, ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ బాబు, కృష్ణ, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డి దంపతులకు సన్మానం

వింజమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సన్మానించారు. ఈసందర్భంగా ప్రజాసేవ, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అసిస్టెంట్ ఎండీ మన్సూర్‌అలీ సూచించారు. సోమవారం మండలంలోని అప్పసముద్రం గ్రామంలో ఆయన సిబ్బందితో కలిసి మైక్రోఫోన్ ద్వారా ప్రచారం నిర్వహించి ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అలాగే పిల్లలను మురికి కూపాలు, వరదనీటి నిల్వ ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలన్నారు. ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యశాలలో చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సురేష్, ఏఎన్ఎం సౌజన్య, ఆశ కార్యకర్త విస్త్రిమ్మలత తదితరులు పాల్గొన్నారు.

వాగుకు అడ్డంగా వేసిన పైపులు తొలగించాలి

● రైతుల ఆందోళన


తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

సంగం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక చవిటి వాగుకు అడ్డంగా స్థానిక ఓ రైతు వేసిన సిమెంట్ పైపులు తొలగించాలని సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట తలుపూరుపాడు, శ్రీకొలను రైతులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని తలుపూరుపాడులో షేక్ ఖాదర్‌బాషా అనే రైతు తన పొలంలోకి వెళ్లేందుకు చవిటి వాగుకు అడ్డంగా సిమెంట్ పైపులు ఏర్పాటు చేయడంతో వాగులో వర్షపు నీరు పారక ఎగువ పొలాలు ముంపునకు గురవుతున్నాయని, దీంతో నారుమళ్లు వేసుకోలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు తహసీల్దారు సోమ్లానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారితో మాట్లాడి న్యాయం చేస్తానని తహసీల్దారు హామీ ఇచ్చారు.

హై ఓల్టేజీతో గృహోపకరణాల దగ్ధం

ఉదయగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ వీరారెడ్డిపల్లి గ్రామ, ఎస్సీ కాలనీలో గృహోపకరణాలు హై ఓల్టేజీతో దగ్ధమైనట్లు సోమవారం పలువురు వాపోయారు. ఆదివారం రాత్రి నివాసాలకు ఒక్కసారిగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కావడంతో ఏసీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌లు, టీవీలు తదితర వస్తువులు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో నివాసంలో రెండు నుంచి మూడు ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయన్నారు.

చెరువుల్లో పుష్కలంగా జలాలు

● సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలు ● విత్తనాలు, యూరియా కోసం ఎదురుచూపు

అనంతసాగరం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో మండలంలోని పలు గ్రామాలలో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. దీంతో మొదటి పంటకు సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. సాగరం చెరువు పరిధిలో 0.73 టీఎంసీల నీటి లభ్యత చేకూరింది. దీంతో సుమారు 5,500 ఎకరాలు సాగుచేసుకునే వీలు కలిగింది. ఉప్పలపాడు, కొత్తపల్లి, పడమటికంభపాడు, ఆమనిచిరివేళ్ల, పాతాళపల్లి చెరువులు వరద జలాలతో నిండాయి. ఈచెరువుల పరిధిలో సుమారు 7వేల ఎకరాలు సాగుకు అనుకూలత ఏర్పడింది. కాలువల్లో పూడికతీత పనుల కోసం కొన్నిచోట్ల రైతులు ముందుకు వస్తున్నారు. దీంతోపాటు ఉత్తర కాలువ, బోర్ల కింద కూడా మొదటి పంట కింద మండలంలో 20 వేల ఎకరాలు సాగుచేసుకునే వెసులుబాటు నెలకొంది. కాగా, మొదటిపంట నాట్లు నవంబరు చివరినాటికి పూర్తిచేసుకునేలా ప్రణాళికలు చేస్తున్నారు. దీంతో విత్తనపు వడ్లు, యూరియా త్వరగా రైతులకు అందేలా చూడాల్సి ఉంది. వాటికి కోసం సాగుదారులు ఎదురు చూస్తున్నారు.


నిండుగా ఉన్న సాగరం చెరువు

C.R.I.M.E N.E.W.S

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● యువకుడి మృతి.. మరొకరికి గాయాలు


మృతి చెందిన వెంకటేశ్వర్లు (ఫైల్)

రాపూరు, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): వేగంగా వ చ్చి కారు ఢీకొనడం తో ఒకరు మరణించగా, మరొకరు గాయపడ్డ సంఘటన రాపూరు మండలం సిద్ధవరం గ్రామ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అరుంధతి వాడకు చెందిన మాతంగి కాంతారావు, చిన్నమ్మల కుమారుడు వెంకటేశ్వర్లు (25), అతని సమీప బంధువు అంజనీ కుమార్‌తో కలిసి ఉదయం సిద్దవరం అరుంధతి వాడ వద్ద బైకుపై ఆగి ఉండగా, వెంకటగిరి నుండి రాపూరు వైపు వస్తున్న కారు అతి వేగంతో వచ్చి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ స్థానికులు 108లో రాపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మాతంగి వెంకటేశ్వర్లు ఆస్పత్రిలో మరణించగా, అంజనీకుమార్ చికిత్స పొందుతున్నాడు. అతని తండ్రి కాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఆత్మకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చెరువులో ఆదివారం సాయంత్రం గల్లంతైన యువకుడు నలిశెట్టి మహేష్(30) మృతదేహం సోమవారం ఉదయం చెరువులో తేలియాడింది. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుని భార్య మొబీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైకుపై నుంచి పడి ఒకరికి గాయాలు

కావలి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడడంతో భానుమూర్తి గాయపడిన సంఘటన పట్టణంలోని ఉదయగిరి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సోమవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు... పట్టణంలోని తుఫాన్‌నగర్ కు చెందిన భానుమూర్తి వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో బ్రిడ్జిపై మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో గాయపడ్డ ఆయనను 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు.

ట్రావెల్స్ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం


జాతీయ రహదారిపై నిలిచిన ట్రావెల్స్ బస్సు

నెల్లూరు(క్రైం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని బుజబుజ నెల్లూరు వద్ద ఒంగోలు వైపు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు సోమవారం ఉదయం త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. గూడూరు వైపు నుంచి ఒంగోలు వైపు వేగంగా వెళుతున్న ఎస్‌వీబీటీ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సరిగ్గా బుజబుజనెల్లూరు హైస్కూల్ వద్దకు వచ్చే సరికి టైరు పేలడంతో బస్సు రోడ్డుకు అటూ ఇటూ తిరిగి పక్కన ఆగింది. ఆ సమయంలో బస్సుకు ముందు, వెనుక వాహనాలు రాకపోవడతో పెద్ద ప్రమాదమే తప్పింది. అదే ప్రాంతంలో ఎన్‌హెచ్ఏఐ వాహనం ఉండటంతో బస్సును ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పక్కకు తీసుకెళ్లారు. దీంతో ట్రాఫిక్‌కు పెద్దగా అంతరాయం ఏర్పడలేదు. బస్సు టైరు పేలడంతో భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు బస్సును దిగి ఇతర వాహనాల్లో గమ్య స్థానాలకు వెళ్లారు.

దొంగగా మారిన ఇంజనీర్!


నిందితుడి వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంజనీర్ దొంగగా మారాడు. బంగారు గోలుసులు, బైక్‌లు అపహరిస్తూ పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. అతని కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు సోమవారం నిందితుడుని అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు వెల్లడించారు. నెల్లూరు నగరంలోని చాకలవీధిలో ఎస్ అక్కమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా ఉంటోంది. ఆమె తన పై పోర్షన్ ఖాళీగా ఉండటంతో టూలెట్ బోర్డు పెట్టారు. ఈ ఏడాది సెప్టెంబరు 23వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి ఇంటి బాడుగ విషయమై మాట్లాడుతున్నట్లు నటిస్తూ ఆమె మెడలోని బంగారు సరుడును తెంపుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు పొదలకూరు మండలం సూరాయపాలెంకు చెందిన శ్రీనాథగా గుర్తించారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టగా చిన్నబజారు ఎస్ఐ అయ్యప్ప నేతృత్వంలోని బృందం సోమవారం పొగతోట ఎస్-2 థియేటర్ రోడ్డులో అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా చిన్నబజారు, బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో రెండు గొలుసు దొంగతనాలు, చిన్నబజారు, నవాబుపేట, దర్గామిట్ట పోలీసు స్టేషన్ల పరిధిలో ఏడు బైక్‌లను దొంగలించినట్లు వెల్లడించారు. దీంతో నిందితుడుని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.5.51 లక్షలు విలువ చేసే 48 గ్రాముల బంగారు గొలుసులు, ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

అప్పుల బాధ భరించలేక..

శ్రీనాథ్ బీటెక్ చదివి ప్రస్తుతం సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడిన ఆయన అప్పులపాలయ్యాడు. అప్పుల బాధలు తాళలేక దొంగగా మారాడని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తెలిపారు. నిందితుడుని అరెస్ట్ చేసి సొత్తును రికవరీ చేసేందుకు కృషి చేసిన ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఎస్ఐ అయ్యప్ప, సిబ్బంది గిరి, సురేష్, సుధాకర్, సతీష్, శ్యామ్, సుబ్బారావు తదితరులను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

బోగోలులో మద్యం దుకాణానికి నోటిఫికేషన్

నెల్లూరు(క్రైం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలోని బోగోలులో ఒక్క వైన్‌షాపునకు దరఖాస్తు చేసుకునేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. బుధవారం నుంచి ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారని ఈఎస్ ఏ శ్రీనివాసులునాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించి ఈనెల 12వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో లాటరీ తీసి షాపును కేటాయిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు కావలి ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

వైభవంగా కోదండరామస్వామి ఉత్సవాలు

కలిగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తూరు ప్రాంతంలోని శ్రీకోదండరామ స్వామి వార్షికోత్సవాల్లో భాగంగా మూడవరోజు సోమవారం ఆలయ ప్రాంగణంలో పూర్ణాహుతి , సుదర్శన హోమం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దంపతులకు ఎండుకొబ్బరి, ఆవునెయ్యి, ధాన్యం, రవికలు భక్తితో సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. విశేష పుష్పాలంకరణతో స్వామికి గ్రామోత్సవం జరిగింది. భక్తులు స్వామికి కాయ, కర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సచివాలయం పక్కనే మురుగు నీరు!



కామాటివారివీధిలో రోడ్డుపైకి చేరిన మురుగునీరు

కావలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జండా చెట్టు సెంటర్‌లోని కామాటి వారివీధిలో ఉన్న 27వ నంబరు సచివాలయం పక్కనే మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఇక్కడికి కేవలం 20 అడుగుల దూరంలో సచివాలయం ఉన్నా కనీసం మురుగు నీటి సమస్యను పట్టించుకునే నాథుడు కనిపించడంలేదు. కాలువలో చెత్త పేరుకుపోయి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. సచివాలయ కార్యదర్శులు కూడా డ్రైనేజీని శుభ్రం చేయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా తొలగించాలని వారు కోరారు.

పబ్లిక్ ఈవీ చార్జింగ్ స్టేషన్ల తనిఖీ



పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రాఘవేంద్రరావు

కావలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం కావలి ప్రాంతంలోని పబ్లిక్ ఈవీ చార్జింగ్ స్టేషన్లను సోమవారం జిల్లా ఎస్‌ఈ రాఘవేంద్రరావు స్థానిక అధికారులతో కలిసి తనిఖీ చేశారు. వాహనాలకు అవసరమయ్యే చార్జింగ్ సమయం, వినియోగమయ్యే యూనిట్ల పరిమాణం. విద్యుత్ భద్రతా ప్రమాణాలు, సౌకర్యాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎస్‌ఈ రాఘవేంద్రరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపు, సుస్థిర అభివృద్ధి నేపథ్యంలో విద్యుత్ వాహనాలదే భవిష్యత్ అని తెలిపారు. ప్రభుత్వ విజన్ 2047 లో భాగంగా ఈవీ వాహనాల వినియోగం వైపు అడుగులు వేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూడా ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవీ చార్జింగ్ స్టేషన్ల నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, కావలి ఈఈ బెనర్జీ, డీఈఈ రవికుమార్ ఏఈలు శ్రీనివాసులు రెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించేందుకే ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలురు

కావలి (టౌన్) నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగివున్న క్రీడా ప్రతిభను గుర్తించేందుకే ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించి ప్రోత్సాహమందిస్తోందని డిప్యూటీ డీఈవో హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో (ఎస్‌జీఎఫ్) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 19 బాల బాలికలకు డివిజన్ స్థాయి పోటీలు నిర్వహించారు. డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి డివిజన్ జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో 1 గోవిందయ్య, ఎంఈవో 2 వెంకటసుబ్బయ్య, జెడ్పీ హెచ్‌ఎమ్ మాధవ, ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ విభజనపై సమావేశం



పెంట్రాల పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాల గ్రామ పంచాయతీ విభజనపై పంచాయతీ కార్యవర్గ సమావేశం సోమవారం పెంట్రాల పంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ కె శ్రీనివాసులు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు నిర్వహించారు. ఈ పంచాయతీలో పెంట్రాల, చీమలపెంట, రాళ్లపాడు గ్రామాలు విలీనమై ఉన్నాయి. అయితే ఈ మూడు గ్రామాలు మూడు పంచాయతీలుగా విభజన చేసేందుకు పంచాయతీ వార్డు సభ్యుల అభిప్రాయాలు సేకరించేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచు, మొత్తం 10 మంది వార్డు సభ్యులు హాజరయ్యారని డిప్యూటి ఎంపీడీఓ శ్రీనివాసులు తెలియజేశారు. పంచాయతీని విభజించాలా, లేక ఉమ్మడిగా ఎప్పటిలాగే ఉండాలా అనే అంశంపై వార్డు సభ్యుల అభిప్రాయాలను సేకరించారు. తగిన చర్యల కోసం వార్డు సభ్యుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీకి కరేడు విద్యార్థులు



క్రీడా ప్రతిభ కనపరిచిన విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాసులు, పీడీ శ్రీనివాసులు

ఉలవపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు మీనీ స్టేడీయంలో జరిగిన సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ సెలక్షన్స్‌లో కరేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. కబడ్డి జట్టుకు ఎంపికైన అర్ యశ్వంత్, బీ వర్షిత, కే చరిష్మా, కే శాంతిప్రియలు ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు కర్నూల్‌లో జరుగు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పీడీ పీ శ్రీనివాసులు తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎంతో పాటు, ఎస్‌ఎంసీ చైర్మన్ బాలేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీకి మణివిష్ణువర్ధన్ ఎంపిక



వలేటివారిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మర్రి మణివిష్ణువర్ధన్ ఎంపికైనట్లు స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కత్తి బజక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో మణివిష్ణువర్ధన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. హైస్కూల్ హెచ్‌ఎం కమల్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు మణివిష్ణువర్ధన్‌కు అభినందనలు తెలిపారు.

ఆశ పెట్టి.. ముంచేశారు!

(5వ పేజీ తరువాయి)

రుణాలను అందిస్తామంటూ తమ నిబంధనలు అనుసరించి సాధారణ రిజిస్ట్రేషన్ పొందిన లబ్ధిదారులకు మాత్రమే రుణాలను అందిస్తున్నారు. ఓటీఎస్ పత్రాలను దరిదాపులకు కూడా రానివ్వడం లేదు.

● **ససేమిరా అంటున్న రిజిస్ట్రేషన్ శాఖ**

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలు తమ ఇళ్లపై రుణాలను పొందాలనే ఉద్దేశంతో ఓటీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న పత్రాలను పక్కనపెట్టి సాధారణ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో సంప్రదిస్తున్నారు. సంబంధిత అధికారులు లబ్ధిదారుల పేర్లపై ఆన్‌లైన్‌లో పరిశీలించి వారు చేయించుకోవాలనుకున్న ఆస్తి ఇదివరకే ఓటీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ అయిపోయిందని, నిబంధనల ప్రకారం మరోసారి రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు పడదని, ఓటీఎస్ ద్వారానే రుణాలు పొందాలని తేల్చిచెబుతున్నారు. ఓటీఎస్ రిజిస్ట్రేషన్ పత్రాలపై రుణాలు ఇవ్వమంటే ఫైనాన్స్ కంపెనీలు ససేమీరా అంటున్నాయి. దీంతో ఇటు చెంపదెబ్బ, అటు గోడదెబ్బ అన్న చందంగా పేద, మధ్య తరగతి ప్రజల పరిస్థితి మారింది.

అన్న క్యాంటీన్‌లో నాసిరకం భోజనం

కావలి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కావలి అన్న క్యాంటీన్‌లో నాసిరకం భోజనం పెడుతున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో ఎం వంశీక్రిష్ణకు వినతిపత్రం అందచేశారు. ఒక్కో భోజనానికి ప్రభుత్వం రూ.35 ప్రకారం చెల్లిస్తున్నా, కాంట్రాక్టర్ మాత్రం నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్నారు. బియ్యం కూడా నాణ్యమైనవి వాడటం లేదన్నారు. అధికారులు స్పందించి అన్నక్యాంటీన్ ద్వారా నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జరుగుమల్లి విజయరత్నం, టీ. మణి, జెడ్డా వాసు, లక్ష్మీనర్సు, నక్కా జక్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

జక్కా వెంకయ్యకు నివాళి



జక్కా వెంకయ్య చిత్రపటం వద్ద లాల్ సలామ్ చేస్తున్న కామ్రేడ్లు

కావలి (టౌన్) నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య 95వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు ఘన నివాళులర్పించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి పెంచలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకయ్య పేదలకు అందించిన సేవలు అనిర్వచనీయమన్నారు. సాగునీటి కోసం ఆయన చేసిన కృషిని జిల్లా రైతాంగం మరవదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్ వెంకయ్య, తిరుపాలు, బి కృష్ణయ్య, వై కృష్ణమోహన్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

బిట్రగుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ వీర రఘు ఆధ్వర్యంలో సోమవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి హాజరై కోటి సంతకాల సేకరణ ఉద్దేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుజాత, జెడ్పీటీసీ కీర్తన, మాజీ ఎంపీపీ సులోచన, ఎంపీటీసీలు ఎం పద్మ, సుందర్‌రాజ్, నేతలు అంకులయ్య, శ్రీనివాసులు, కళ్యాణ్, సురేష్, సాల్మన్‌రాజ్ పాల్గొన్నారు.

ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా.. ఇంతేనా ?



ధ్వంసమైన రోడ్డుపై వాహనచోదకుల పాట్లు

అల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అల్లూరు నుండి కావలికి వెళ్లే మార్గం అధ్వాన్నంగా తయారైంది. గత టీడీపీ హయాంలో మంజూరైన ఈ రోడ్డు నిర్మాణం వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టారు. అయితే కనీసం మూడేళ్లు కూడా గడవక ముందే రోడ్డు ధ్వంసమైంది. నిర్మించిన ఆరు నెలలకే అల్లూరు పొలిమేరలోని పెట్రోల్ బంకు వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. ఎన్నికల సందర్భంలో కొంతమంది నాయకులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. అయినా మూడడుగుల లోతు గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. దీంతో తరచూ వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలి

ఉదయగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ చేయాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల దినంలో జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాకు ఉదయగిరి అభివృద్ధి ఫోరం ప్రతినిధులు ఎండీ ఖాజా, శ్రీరామచంద్రమూర్తిలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలు, డివిజన్ల పునర్విభజనపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించి సమీక్షిస్తోందన్నారు. అనాదిగా అభివృద్ధి నోచుకోని, విస్తీర్ణంలో పెద్దదైన ఉదయగిరి నియోజకవర్గాన్ని ఉదయగిరి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ చేయాలని వారు కోరారు.

అధ్వానంగా వలేటివారిపాలెం - అగ్రహారం రోడ్డు



వలేటివారిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం - అగ్రహారం రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం రూ. 20 లక్షలు నిధులు మంజూరు చేసినా రోడ్డు పనులు జరగలేదు. నిధులు మంజూరై ఏడాది దాటినా ఇంతవరకూ రోడ్డు పనులు ప్రారంభించలేదు. కాగా, వలేటివారిపాలెం నుండి రామచంద్రాపురం వరకూ రహదారి అధ్వానంగా మారింది. రోడ్డంతా మోకాటిలోతు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్డు పనులు ప్రారంభించాలని వాహనదారులు కోరుతున్నారు.

'ప్రకాశం'లో పీసీబీ డిజైన్ ఫాబ్రికేషన్ వర్క్‌షాప్



మాట్లాడుతున్న కాలేజీ కరస్పాండెంట్ విజయ్‌శ్రీనివాస్

కందుకూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఎపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో వారంరోజుల పీసీబీ డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్ వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎపీఎస్ఎస్‌డీసీ ఇన్‌స్ట్రక్టర్ రుబీనా, కళాశాల వర్క్‌షాప్ కోఆర్డినేటర్ మస్తాన్‌వలి మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో సర్క్యూట్‌బోర్డుల రూపకల్పన, తయారీ పద్ధతులు సర్క్యూట్ అనాలసిస్ వంటి అంశాలను నేర్పించటం జరిగిందన్నారు. కళాశాల కరస్పాండెంట్ కె విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ కోర్‌బ్రాండ్ విద్యార్థినీ, విద్యార్థులకు భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటికి విద్యార్థులను సన్నద్ధం చేయటమే ఈ వర్క్‌షాప్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, ఈసీఈ హెడ్ గద్దె రమేష్, ఈఈఈ హెడ్ మీరా షరీఫ్, మస్తాన్‌వలి, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి



సబ్ కలెక్టర్ హిమవంశీకి వినతిపత్రం అందచేసిన మత్స్యకారులు

ఉలవపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన తమను ఆదుకోవాలని రామాయపట్నం గ్రామానికి చెందిన మజరా పల్లెపాలెం మత్స్యకారులు సోమవారం సాయంత్రం ఉలవపాడు రెవెన్యూ కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ దామెర హిమవంశీని కలిసి వినతి పత్రం అందచేశారు. సముద్ర తీరం వెంబడి జల్లీఫిష్‌ల కోసం కట్టిన 6 తొట్టెలు తుఫాన్ తాకిడికి, సముద్రం అలలకు ధ్వంసమయ్యాయని, అదేవిధంగా రెండు రొయ్యల చెరువుల్లోని పంట పూర్తిగా కొట్టుకుపోయిందని సబ్ కలెక్టర్‌కి వివరించారు. సచివాలయం ఫిషరీష్ అసిస్టెంట్ అధికారుల ఆదేశాల మేరకు జరిగిన నష్టంపై నివేదిక తయారు చేశారని, దానిపై స్పందించి నష్టపరిహారం వచ్చేలా చూడాలని మత్స్యకారులు సబ్‌కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



రవితేజ కుటుంబసభ్యులకు ఆర్థికసహాయం అందజేస్తున్న పువ్వాడి మౌనిక

కందుకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరు రోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న తోకల రవితేజకు స్కంధపురి సేవాసమితి తరపున రూ. 50వేలు ఆర్థిక సహాయం అం దించారు. సేవాసమితి చైర్మన్ పువ్వాడి మౌనిక దాతల నుంచి సేకరించిన రూ. 40వేలకు తాను రూ. 10వేలు కలిపి హాస్పటల్‌కు వెళ్లి రవితేజను పరామర్శించి మొత్తాన్ని అందజేశారు.

కందుకూరును 'ప్రకాశం'లో కలపాలని వినతి



సబ్ కలెక్టరు హిమవంశీకి వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

కందుకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలని కోరుతూ వైసీపీ నేతలు సోమవారం సబ్ కలెక్టరు దామెర హిమవంశీకి వినతిపత్రం అందజేశారు. రామాయపట్నం పోర్టుకోసం కందుకూరును నెల్లూరులోనే ఉంచేలా కొందరు పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నందున ఇక్కడి ప్రజల ఆకాంక్షను ప్రభుత్వానికి తెలియజేసి గతంలో మాదిరిగానే కందుకూరును ప్రకాశం జిల్లాలో కలిపేలా చూడాలని కోరారు. గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్‌లు ఇచ్చిన హామీమేరకు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలని కోరారు. సబ్ కలెక్టరును కలిసిన వారిలో వైసీపీ నేతలు తోకల కొండయ్య, గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, షేక్ రఫీ, ఈదర రమేష్, ఆర్. బ్రహ్మానందం, చీమల రాజా, వల్లూరి కోటేశ్వరరావు, తదితరులున్నారు.

గెస్ట్ జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రెండు లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నందున ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ కె వాణీశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో ఉర్దూ, ఆంగ్లం బోధించేందుకు జూనియర్ లెక్చరర్స్‌ను నియమించాల్సి ఉందన్నారు. అందుకు గాను ఉర్దూ బోధించుటకు ఎంఏ (ఉర్దూ), ఆంగ్లం బోధించుటకు ఎంఏ (ఇంగ్లీషు) పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల7వ తేదీ ఉదయం 10 గంటలకు అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికేట్స్‌తో ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె కోరారు.

భైరవకోనకు ప్రత్యేక బస్సు

ఉదయగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో నుంచి బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భైరవకోన క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు డిపో మేనేజర్ రమేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సు ఉదయం 8 గంటలకు ఉదయగిరిలో బయలుదేరి సీతారామపురం మీదుగా భైరవకోన క్షేత్రానికి చేరుకొంటుందన్నారు. కావున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలి



రైతులకు ఉచితంగా మందులు అందిస్తున్న డీడీ నాగమణి, పశువైద్య సిబ్బంది

కలువాయి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకునేందుకు పశువులకు తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమణి రైతులకు సూచించారు. మండలంలోని కుమ్మరిపల్లిలో సోమవారం రాష్ట్రీయ గోకుల మిషన్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రధానంగా పశువులకు గాలికుంటు, గొంతువాపు టీకాలతోపాటు పశువుల నుంచి మనుషులకు వచ్చే బ్రూసెల్ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో శ్రీనివాసులు, ఏడీ గురు జయంతి, పశువైద్యులు కృష్ణమోహన్, కృష్ణప్రసాద్, రాజేష్, జయప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం



కందుకూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం కందుకూరు గ్రామదేవత అంకమ్మకు అభిషేకం, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న మహా శివలింగానికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కార్తీక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం దేవాలయ ఆవరణలో కార్తీక దీపోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

లింగసముద్రం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవనిలో ఇద్దరు పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్సై ఎం నారాయణ, సిబ్బందితో సోమవారం సాయంత్రం గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడిలో వారి నుంచి రూ.19,100 నగదు, 4 మోటారు సైకిళ్ల సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి, ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవీ రోడ్డులో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున ఎమ్మార్వో ఆఫీసు ఫీడర్‌లో మంగళవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం విద్యుత్ సరఫరా నిలిచిన అన్ని ప్రాంతాలకు మంగళవారం కూడా సరఫరా నిలిచిపోతుందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

చినపవనిలో అధిక ధరకు విత్తనాల విక్రయం

లింగసముద్రం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవనిలో లైసెన్సు లేని మరో మండలానికి చెందిన ఓ పురుగు మందులు, విత్తనాల దుకాణం డీలరు ఒకరు లారీలో వరి విత్తనాల బస్తాలను తెచ్చి అధిక ధరకు విక్రయించినా వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుడ్లూరు మండల కేంద్రంలోని పురుగు మందుల, విత్తనాల డీలరు ఒకరు లారీలో సుమారు 1200 బస్తాల షుగర్‌లెస్, కెఎన్‌ఎం రకం వరి విత్తనాలను చినపవని గ్రామానికి తెచ్చి గ్రామంలోని రైతులకు విక్రయించారు. ఆయన షుగర్‌లెస్ రకం 25 కేజీల విత్తనాల బస్తాను ఒక్కో రూ.1070కు, కెఎన్‌ఎం రకం 25 కేజీల వరి విత్తనాల బస్తాను ఒక్కోటి రూ1040కు అమ్మినట్టు గ్రామ రైతులు తెలిపారు. ఎంఆర్‌పి కంటే అధిక ధరకు అమ్మినట్టు వారు చెప్పారు. అలాగే రైతులు కొన్న వరి విత్తనాల బస్తాకు ఆయన ఎలాంటి బిల్లులు ఇవ్వలేదని చెప్పారు.

కపిలేశ్వరాలయంలో భద్రత కట్టుదిట్టం

కార్తీక మాసం రెండో సోమవారం. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో ఆలయ మార్గంలో ఆంక్షలు విధించారు. పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు ముందస్తు జాగ్రత్తగా అన్నారావు సర్కిల్ మీదుగా కపిలేశ్వరాలయానికి వెళ్లే కేటీరోడ్డు రెండు వైపులా బారికేడ్లు పెట్టి వాహన రాకపోకలను హరేరామ హరేకృష్ణ మార్గం వైపు మళ్లించారు. ద్విచక్ర వాహనాలను కూడా అనుమతించలేదు. ఆలయంలోకి నంది సర్కిల్ నుంచే క్యూలైన్‌ను ఏర్పాటు చేశారు. ఆంజనేయస్వామి సన్నిధి సమీపంలోని ఉద్యానవనం (జంగిల్ బుక్)లో కార్తీక దీపాలు వెలిగించడానికి వెళ్లి, వచ్చేలా క్యూలైన్‌ను సడలించారు. జలపాతం, పుష్కరిణి వైపు వెళ్లకుండా గేట్లను అమర్చారు. స్వామి,





అమ్మవార్ల దర్శనం చేసుకుని బయటకు రాగి, వేప చెట్టు వద్ద పూజలు చేయడం ఆనవాయితీ. ఈసారి ఆ అవకాశం లేకుండా క్యూలైన్ పెట్టారు. కార్తీక దీపాలు వెలిగించాక దర్శనానికి వెళ్లడానికి భక్తులు అవస్థలు పడ్డారు. కొందరు దర్శనం చేసుకోకుండానే దీపాలు వెలిగించి తిరుగుముఖం పట్టారు. ఇక, కపిలేశ్వరాలయం దీపాల వెలుగులతో నిండిపోయింది. జంగిల్ బుక్‌లో దీపాలు వెలిగించి పూజలు చేశారు. సాయంత్రం దీపాలు వెలిగించడానికి వచ్చే భక్తుల సంఖ్య కొంత పెరిగింది. ఇక, కపిలతీర్థంలోకి అనుమతించలేదు. జిల్లాలోని అన్ని శివాలయాలు, జలపాతాల వద్ద కూడా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

లక్ష దీపోత్సవం



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధమైన వైష్ణవ పుష్కరిణిలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. పుష్కరిణి చుట్టూ నేతిదీపాలను వెలిగించారు. - శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



సత్యవేడుకు రెవెన్యూ డివిజన్ వచ్చేనా?

- శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట డివిజన్ల నడుమ చీలిన నియోజకవర్గం
- ఎన్నికల ప్రచారంలో పరిశీలిస్తానంటూ చంద్రబాబు హామీ
- ప్రభుత్వానికి తరచూ ఎమ్మెల్యే వినతులు

జిల్లాలో మారుమూల నియోజకవర్గంగా పేరుపడిన సత్యవేడుకు రెవెన్యూ డివిజన్ మంజూరు చేయాలన్న డిమాండ్ ఊపందుకుంటోంది. ఈ నియోజకవర్గంలోని ఏడు మండలాలూ ప్రస్తుతం శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట డివిజన్ల నడుమ విభజితమైన సంగతి తెలిసిందే. సత్యవేడును రెవెన్యూ డివిజన్ చేసి నియోజకవర్గం మొత్తాన్ని దాని పరిధిలోకి తేవాలన్నది అక్కడి ప్రజలు, ప్రజాప్రతినిధుల కోరిక.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సత్యవేడు నియోజకవర్గం భౌగోళికంగా అతి పెద్దది. సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాలెం మండలాలున్నాయి. గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేపట్టినపుడు వీటిలో సత్యవేడు, వరదయ్యపాలెం, బీఎన్ కండ్రిగ మండలాలు మూడింటినీ సూళ్ళూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో చేర్చింది. మిగిలిన నాగలాపురం, పిచ్చాటూరు, కేవీబీపురం, నారాయణవనం మండలాలను శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో కలిపింది. దీంతో ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షించే సమయంలో ఇద్దరు ఆర్డీవోల నుంచీ సమాచారం తీసుకోవాల్సి వస్తోంది. సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఇద్దరు ఆర్డీవోలను సంప్రదించాలి. ఇది పాలనాపరంగా అసౌకర్యంగా మారుతోంది.

సత్యవేడు డివిజన్‌పై ఎన్నికల్లో హామీ

గత ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు సత్యవేడుకు వచ్చిన సందర్భంలో పార్టీ అభ్యర్థి హోదాలో కోనేటి ఆదిమూలం ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై స్పందించిన చంద్రబాబు బహిరంగసభలో ప్రసంగిస్తూ దీన్ని ప్రస్తావించారు. అధికారంలోకి వస్తే సత్యవేడులో రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.

ప్రస్తుత కసరత్తులోనే తేల్చాలంటున్న జనం

గత వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా జరిపిన జిల్లాల, రెవెన్యూ డివిజన్ల పునర్విభజనను సరిదిద్దేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. నగరి, తిరుపతి, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్లలో మార్పులు అనివార్యం కానున్నాయి. నగరి డివిజన్ తిరుపతి జిల్లా పరిధిలోకి రావడంతో పాటు తిరుపతి డివిజన్ పరిధి నుంచీ వడమాలపేట, పుత్తూరు మండలాలు నగరి డివిజన్ పరిధిలోకి వెళ్లనున్నాయి. అలాగే వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోకి రానున్నాయి. ఈ మార్పులు ఎలాగూ జరుగుతాయి కనుక అదే సందర్భంలో సత్యవేడు డివిజన్ ఏర్పాటుపైనా సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో పాటు ప్రజలు సైతం కోరుతున్నారు. సత్యవేడు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని ఏడు మండలాలనూ దాని పరిధిలోకి తేవాలని అభ్యర్థిస్తున్నారు. ముఖ్యంగా సత్యవేడు, వరదయ్యపాలెం, బీఎన్ కండ్రిగ మండలాలు పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. శ్రీసిటీ సెజ్‌తో పాటు పలు ఏపీఐఐసీ పారిశ్రామికవాడలు ఇప్పటికే ఉండగా, మరిన్ని పార్కులు ఏర్పాటవుతున్నాయి. దీంతో తరచూ ప్రభుత్వం ఈ మండలాల్లో పరిశ్రమల కోసం భూములు సేకరిస్తోంది. సత్యవేడు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటైతే భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశముంటుంది. అదే సమయంలో నియోజకవర్గ ప్రజల రెవెన్యూ, భూముల సంబంధ సమస్యల పరిష్కారం కూడా త్వరగా జరిగేందుకు ఆస్కారముంటుంది. నియోజకవర్గ ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా సత్యవేడు డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముంది.

విశ్రాంత ఉద్యోగుల పెన్షన్‌లో
ఒకరికి కోత.. మరొకరికి పునరుద్ధరణ

తిరుపతి(వైద్యం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈఎస్‌ఐ ఆస్పత్రిలో రిటైరైన డాక్టర్‌కు పెన్షన్‌లో 9 శాతం కోత పడింది. నిధుల దుర్వినియోగం ఆరోపణలపై వైద్య ఆరోగ్య శాఖ విశ్రాంత ఏవోకు గతంలో పెన్షన్‌లో విధించిన కోతను ఎత్తివేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ● తిరుపతిలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్‌గా రిటైరైన డాక్టర్ సీకే రమేష్‌కుమార్.. 2017లో కర్నూలు జిల్లాలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఆ సమయంలో నర్సింగ్ హోమ్‌లు, ప్రవేటు ఆస్పత్రులు స్థాపించి వాటిల్లో అర్హత లేని వ్యక్తులను వైద్యులుగా నియమించి రోగులకు వైద్యం అందించారంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీనిపై ప్రభుత్వం విజిలెన్సు విచారణ చేపట్టింది. ఆ ఆరోపణలు వాస్తవాలుగా నిర్ధారించడంతో ఆయనపై అప్పట్లో క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందింది. దీంతో ఆయనకు అందుతున్న పింఛనులో మూడేళ్ల పాటు 9 శాతం కోత విధిస్తూ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.

● 2015లో చిత్తూరులోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పరిపాలన అధికారి(ఏవో)గా పనిచేస్తున్న ఎస్ అరుణాచలం తప్పుడు మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను క్లైయిమ్ చేసి నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో అప్పట్లో విచారణ చేపట్టారు. ఈ కేసు విచారణలో ఉండగా ఆయన 2018లో పదవీ విరమణ పొందారు. విచారణ అనంతరం ఆయనకు అందే పింఛనులో 5 శాతం శాశ్వతంగా కోత విధించాలని అప్పట్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై బాధితుడు ఎస్ అరుణాచలం ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో బాధితుడికి ఎటువంటి కోత లేకుండా పూర్తి స్థాయిలో పింఛను అందించడంతోపాటు ఆయనకు రావాల్సిన బకాయిలను కూడా అందించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయనకు రావాల్సిన పెన్షను బకాయిలతో కలిసి నెలలోపు చెల్లించాలని సౌరభ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.

జూలో ఎర్ర మెడ వాలాబీ మృతి



వాలాబీ (ఫైల్ ఫొటో)

మంగళం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ జూపార్కులో సోమవారం ఆడ ఎర్రమెడ వాలాబీ అనారోగ్యంతో మృతిచెందినట్లు జూపార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు. మూడు రోజుల క్రితం టాక్సో ప్లాస్మోసిస్ వ్యాధిసోకి మగ ఎర్రమెడ వాలాబీ మృతి చెందగా.. ఇపుడు అదే సమస్యతో ఆడవాలాబీ మృతి చెందిందన్నారు. ఈ ఏడాది ఆగస్టులో గుజరాత్‌కు చెందిన రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టు ఒక జత మీర్ కాట్స్, ఒక జత కామన్ మార్మోసెట్స్‌తో పాటు ఒక జత ఎర్ర మెడగల వాలాబీలను జూపార్కుకు విరాళంగా ఇచ్చారు. వాలాబీ కళేబరానికి పోస్టుమార్టం నిమిత్తం వెటర్నరీ యూనివర్సిటీకి తరలించారు.



వైద్యశాల ప్రారంభం అనంతరం మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రూ.500కోట్లతో త్వరలో ఇంట్రామోడల్ బస్సు టెర్మినల్

రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక హంగులతో తిరుపతి నగరంలో రూ.500కోట్లతో ఇంట్రా మోడల్ బస్సు టెర్మినల్ అతి త్వరలో నిర్మించబోతున్నామని రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన అలిపిరి రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ వైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రూ. 1.90కోట్లతో అధునాతన సౌకర్యాలతో వైద్యశాల, శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చే ఆర్టీసీ ప్రముఖులు, అధికారులు, అతిథుల కోసం రూ.2కోట్లతో విశ్రాంతి గదులు నిర్మించామన్నారు. ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్టీసీలో ప్రమాదాల నివారణకు చట్టాలను కఠినతరం చేయనున్నట్లు చెప్పారు. కర్నూలులో బస్సు ప్రమాదం తర్వాత చట్టాలను కఠినతరం చేస్తున్నామన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులను ఎక్కడికక్కడ సీజ్ చేస్తున్నామన్నారు. వందశాతం ప్రమాణాలు కలిగిన బస్సులు మాత్రమే రోడ్డెక్కేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆర్ అండ్ బీ, హైవేస్‌లో ఎక్కువ ప్రమాదాలు జరిగే స్థలాలను బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించి, అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై ఆలోచన చేస్తున్నామన్నారు. అంతకుముందు ఆయన వైద్యశాలను, ఎండీ ద్వారక తిరుమలరావు గెస్ట్‌హౌస్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కడప, నెల్లూరు జోనల్ చైర్మన్లు పూల నాగరాజు, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ఈడీలు చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్, రవివర్మ, చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ పాల్గొన్నారు.

రెండు మద్యం దుకాణాలకు
మళ్లీ నోటిఫికేషన్

- దరఖాస్తుల సమర్పణకు 10న ఆఖరు గడువు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు లైసెన్సు ఫీజు చెల్లించని రెండు మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ సోమవారం మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసింది. సూళ్లూరుపేట మున్సిపల్ పరిధిలో.. దొరవారిసత్రంలోని ఈ దుకాణాలకు ఈ నెల 10 వతేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించార.ఉ వచ్చిన దరఖాస్తులను 12న 8 గంటలకు కలెక్టరేట్‌లో పరిశీలించి లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. రానున్న 11 నెలలకు గాను సూళ్ళూరుపేట మున్సిపల్ పరిధిలో అయితే ఎక్సైజ్ ట్యాక్స్ కింద రూ 65,54,167, దొరవారిసత్రం పరిధిలో రూ.55,45,834 చెల్లించాలని ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా లేదా ఆఫ్‌లైన్ ద్వారా లేదా హైబ్రిడ్ విధానం ద్వారా దరఖాస్తు చేయవచ్చన్నారు.

ఉద్యోగం ఎరతో సైబర్ టోకరా

- రూ.17.99 లక్షలకు ఎసరు

తిరుపతి(నేరవిభాగం)నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం వస్తుందనే ఆశతో సైబర్ ఉచ్చులో పడి మోసపోయాడో వ్యక్తి. రూ.17.99 లక్షలు పోగొట్టుకున్నాడు.ఎస్‌ఐ లోకేష్‌బాబు కథనం మేరకు..ఈ ఏడాది జూన్‌లో ప్రియా అనే పేరుతో ఫేస్‌బుక్ ద్వారా బాధితునికి ఓవ్యక్తి పరిచయమయ్యాడు. టెలిగ్రామ్ గ్రూపులు, వాట్సాప్ నెంబర్ల ద్వారా ఉద్యోగ ఆఫర్లున్నాయని నమ్మించాడు. మొదట రిజిస్ట్రేషన్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, రూమ్ చార్జీలు, జీఎస్టీ, ఎస్‌జీఎస్టీ వంటి మాటలు చెప్పి పలు సార్లు డబ్బులు జమ చేయించుకున్నాడు. తర్వాత ఫోటోలు, సంతకం తీసుకుని ఎడిట్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసి బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. ఇలా 171 ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా రూ.17.99 లక్షల మేర జమ చేయించుకున్నాడు. తిరిగి డబ్బులు ఇవ్వమంటే అదిగో ఇదిగో అంటూ వాయిదాలు వేస్తూ వచ్చాడు. చివరికి తాను సైబర్ వలలో పడి మోసపోయానని గుర్తించిన బాధితుడు సోమవారం అలిపిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

ఫిర్యాదుదారులతో దురుసు ప్రవర్తన

- పీజీఆర్ఎస్‌లో అధికారిని తప్పించిన ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో ఆ పోలీసు ఉన్నతాధికారి కొంత దురుసుగా వ్యవహరిస్తున్నారు. వారిని నిలబెట్టి మాట్లాడిస్తున్నారు. వారితో సౌమ్యంగా మెలగడం మరచి, అమర్యాదగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు పెరిగాయి. దీనిపై విచారించిన ఎస్పీ సుబ్బరాయుడు.. పీజీఆర్ఎస్ విధుల నుంచి ఆ అధికారిని పక్కన పెట్టారు. మరో అధికారిని సోమవారం నియమించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తున్న ఫిర్యాదుదారుల పట్ల మానవత్వంతో వ్యవహరించుకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదుదారులతో పోలీసు అధికారుల మాట తీరు, ప్రవర్తనపై ఎస్పీ దృష్టి పెట్టారు. ఫిర్యాదుదారులతో అధికారులు ఎలా మెలగుతున్నారు? కౌంటర్ల వద్ద ఉన్న సీఐలు, సిబ్బంది వద్దకు వచ్చే అర్జీదారులతో వారెలా ప్రవర్తిస్తున్నారు? సమస్యలపై ఎలా స్పందిస్తున్నారనే దానిపై నిఘా పెట్టారు. అవసరమైతే ఎస్పీ సిబ్బంది నేరుగా ఫిర్యాదుదారులతో మాట్లాడి అధికారుల పనితీరుపై ఆరా తీస్తున్నారు. ప్రత్యేక నివేదికను ఎస్పీకి అందచేస్తున్నారు. ఈ క్రమంలోనే పీజీఆర్ఎస్ విధుల నుంచి ఆ అధికారిని తప్పించినట్లు తెలిసింది. దీంతో మిగతావారి ప్రవర్తనలోనూ మార్పు వచ్చినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. కాగా, గత రెండ సోమవారాలు పోలీసు పీజీఆర్ఎస్ వాయిదా పడింది. దీంతో ఈ సోమవారం దాదాపు 123 మంది ఎస్పీ కార్యాలయానికి వచ్చి తమ బాధలను వివరించారు. దివ్యాంగుల వద్దకే ఎస్పీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, రామకృష్ణ, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బంధువుల ఇంటికొచ్చి వెళ్తూ..!

ట్యాంకర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తండ్రీ కొడుకుల దుర్మరణం



రూపేష్, సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటోలు)

పెళ్లకూరు, నవంబరు, 3 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం పెసలగుర్రప్పతోట వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు మృతిచెందారు. శ్రీకాళహస్తి పట్టణం వీఎంపల్లె ప్రాంతానికి చెందిన ఉలస సుబ్రహ్మణ్యం(31), తన కుమారుడు రూపేష్(9)తో కలిసి నాయుడుపేటలో బంధువుల ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో పెసలగుర్రప్పతోట వద్ద రాంగ్ రూట్‌లో వెళ్తూ ట్యాంకర్‌ను ఢీకొన్నారు. సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతిచెందారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ నాగరాజు.. తీవ్రంగా గాయపడిన రూపేష్‌ను ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వెంటిలేటర్ లేకపోవడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7న డిప్యూటీ సీఎం తిరుపతి రాక

మంగళం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, అటవీశాఖమంత్రి పవన్‌కల్యాణ్ 7, 8 తేదీలలో మామండూరు, పలమనేరులో పర్యటించనున్నారు. ఎర్రచందనం గోడామును పరిశీలించనున్నారు. ఎర్రచందనం ప్రొటెక్షన్‌పై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించనునానరు.

తిరుమలలో రేపు కార్తీక పౌర్ణమి గరుడసేవ

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం కార్తీక పౌర్ణమి గరుడసేవ జరుగనుంది. ఆరోజు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మాడవీధుల్లో మలయప్పస్వామిని ఊరేగిస్తారు. కార్తీక మాసంలోని పౌర్ణమి కావడంతో భక్తులు భారీగా వచ్చే అవకాశముందనే అంచనాతో టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది.

వానమామలై జీయర్‌స్వామికి టీటీడీ పెద్ద మర్యాద

తిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముంగునేరి వానమామలై మఠానికి చెందిన పరమహంసేత్యంతి మధురకవి వానామామలై జీయర్‌స్వామి సోమవారం తిరుమల శ్రీవారిని పెద్ద మర్యాదతో దర్శించుకున్నారు. ఉదయం అఖిలాండం వద్ద టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చకబృందం ఆయనకు ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకీలో తీసుకెళ్లిన శఠగోపాన్ని సమర్పించి ఆహ్వానించారు. అనంతరం టీటీడీ పెద్దజీయర్ మఠానికి స్వామి చేరుకోగా ఈవో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. టీడీపీ ఎమ్మెల్యే, విప్ గణబాబు, ప్రభుత్వ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, సినీని ర్మాత ఏఎం రత్నం, బాలీవుడ్ నటుడు తుషార్ కపూర్ ఉన్నారు.



శ్రీవారి ఆలయం వద్ద తుషార్ కపూర్


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.51 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,442

తలనీలాలు సమర్పించినవారు: 24,692



నా భర్తను చంపేశారు

● పోలీసులు న్యాయం చేయట్లేదు

● పీజీఆర్ఎస్‌లో ఎస్పీ ఎదుట బాధితురాలి మొర



చంటిబిడ్డతో ఎస్పీని కలిసిన హేమలత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'నాభర్తను మా అత్త, బావ చంపేశారు. పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు' అంటూ బాధితురాలు హేమలత ఎస్పీ సుబ్బరాయుడు ఎదుట సోమవారం పీజీఆర్ఎస్‌లో మొర పెట్టుకున్నారు. 'మాది వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం. సత్యవేడు మండలం మాదనపాలేనికి చెందిన కృష్ణకుమార్‌తో 2023లో నాకు వివాహమైంది. నా భర్తకు అన్న కిరణ్‌కుమార్, సోదరి అశ్విని ఉన్నారు. ఆ తర్వాత నేను డెలివరీ కోసం పుట్టింటికి వచ్చా. ఆ సమయంలో నా భర్త, అతడి అన్న మధ్య ఆస్తుల తగాదాలు చోటు చేసుకున్నాయి. అనంతరం తరచూ గొడవలు జరిగేవి. మా బావ కిరణ్‌కుమార్‌కు మగ బిడ్డ, ఆడ బిడ్డ ఉన్నారు. మాకు మగ బిడ్డ పుట్టడంతో, ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందన్న ఆక్రోశంతో నా భర్తను అంతమొందించాలని పథకం పన్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 12న ఇంట్లో ఉన్న నా భర్తపై అత్త వసంతమ్మ, బావ కిరణ్‌కుమార్ దాడి చేయడంతో మృతిచెందారు. నేను అత్తింటికి వెళ్లేటప్పటికే ఖననం చేశారు. నేను భయపడి పుట్టింటికి వచ్చా. వడమాలపేట పోలీసులకు ఫిర్యాదు చేశా. పోలీసులు కనీసం స్పందించలేదు. ఆ తర్వాత కర్మక్రియలకు వెళ్లగా నాపై నా భర్త మేనమామ కుమారుడు భరత్ కర్రలతో దాడి చేశారు. దీనిపై సెప్టెంబరు 28న ఫిర్యాదు చేశా. న్యాయం చేయాలని పలు సార్లు వడమాలపేట పోలీసులను ప్రాధేయపడినా పట్టించుకోలేదు. చివరకు సెప్టెంబరు 29న కేసు నమోదు చేశారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. నా భర్త చనిపోయిన సమయంలో మా అత్త ఇంట్లో ఉన్న నా పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు ఇప్పించాలని పోలీసులను కోరినా ఫలితం లేదు. ఇప్పటికీ నాకు న్యాయం చేయకపోగా పోలీసుల నుంచి ఒత్తిడి ఉంది. పెళ్లి సమయంలో మా అమ్మ వారు పెట్టిన 10 సవర్ల బంగారు నగలు మా అత్త వద్ద ఉన్నాయి. అవి ఇప్పించండం. నాకు న్యాయం చేయండి' అంటూ ఆమె చంటిబిడ్డతో వచ్చి ఎస్పీ సుబ్బరాయుడిని ప్రాధేయ పడ్డారు. దీనిపై విచారించి, న్యాయం చేస్తామని బాధితురాలికి ఎస్పీ హామీ ఇచ్చారు.

మా బాధలు ఆలకించండి

అధికారులకు అర్జీదారుల వేడుకోలు ● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 403 ఫిర్యాదులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'కలెక్టరేట్ చుట్టూ వారాల తరబడి తిరుగుతున్నా మా సమస్యలు పరిష్కారం కావడం లేదు. మీరైనా మా బాధలు ఆలకించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. దీపావళి, మొంథా తుఫాన్ కారణంగా గడచిన రెండు వారాలు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించలేదు. దీంతో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎన్నడూ లేని విధంగా 403 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 262 వినతులు వచ్చాయి. డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పట్టా ఇచ్చి ప్లాట్ చూపించలేదు



మేము కూలీనాలి చేసుకుని బతుకుతున్నాం. గత వైసీపీ ప్రభుత్వం ఆర్సీపురం మండలం నెన్నూరు వద్ద ఇంటి పట్టా ఇచ్చారు. తీరా స్థలం చూపించలేదు. నాలుగేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. మీరైనా స్పందించి మాకు ప్లాట్ చూపించండి

- గంగ, దామినేడు, తిరుపతి రూరల్ మండలం

పింఛను కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా..



నేను ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడిని. రెండేళ్ల కిందట ప్రమాదం జరిగి కాలు విరిగింది. నడవలేని స్థితిలో ఉన్నా. అంగవైకల్యం కింద పింఛను మంజూరు చేయాలని కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నా. ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా న్యాయం చేయండి.

- వెంకటాద్రి, రాజీవ్‌గాంధీ కాలనీ, రేణిగుంట

మీరైనా పింఛను ఇచ్చి ఆదుకోండి



అయ్యా నేను పెయింట్ పనిచేసుకునేవాడిని. నాలుగేళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో నడవలేని స్థితికి చేరుకున్నా. గత ప్రభుత్వంలో పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయా. మీరైనా ఇచ్చి ఆదుకోండి.

- భాస్కర్, లింగేశ్వర్‌నగర్, తిరుపతి రూరల్ మండలం

మా ఇంటి స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారు



వెంకటగిరి పట్టణంలో 1.20 ఎకరాలు ఉంది. ఇందులో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాళ్లం. ప్రస్తుతం నీళ్లు లేకపోవడంతో చుట్టుపక్కల లేఅవుట్లు వెలిశాయి. మేమూ అందులో నివాసం ఏర్పరచుకుని ఉన్నాం. మా అనుభవంలో ఉన్న ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు వీఆర్వో, సర్వేయర్ ద్వారా మా సమీప బంధువు నరసింహరావు ప్రయత్నిస్తున్నారు. అతడిపై చర్యలు తీసుకోండి.

- యమున, నాగులగుంట పాళెం, వెంకటగిరి

గుకూరు చెరువును పరిరక్షించండి

చెరువు కలుజుకు అడ్డంగా కంచె నాటి, చెరువును పూడ్చి ఇల్లు కడుతున్నారు. దీంతో స్వరూపమే మారిపోతోంది. స్పందించి చెరువును పరిరక్షించాలి. చెరువులో ఉన్న పట్టాలను రద్దు చేయాలి.

- గూళూరు చెరువు ఆయకట్టుదారులు, వడమాలపేట మండలం



వైద్య విద్యార్థులపై దాడి ఘటనలో చర్యలు తీసుకోండి



వైద్య విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోండి. రుయా అత్యవసర విభాగంలో పనిచేసే మేము రెండు రోజుల క్రితం విధులు ముగించుకుని అల్పాహారం కోసం వెళుతుండగా వెస్ట్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులు ఆపారు. మేము వైద్య విద్యార్థులమని, టిఫిన్ తినడానికి వెళుతున్నామని చెప్పినా వినలేదు. దాడి చేసి, దూషించారు. వారిపై చర్యలు తీసుకోండి.

- ఎస్వీ మెడికల్ కళాశాల విద్యార్థుల డిమాండ్

టీటీడీకి విరాళంగా ఎలక్ట్రికల్ బైక్‌లు

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): టీటీడీకి సోమవారం మూడు ఎలక్ట్రికల్ ద్విచక్రవాహనాలు విరాళంగా అందాయి. ధర్మవరంకు చెందిన వేణు మోటర్స్ సీఈవో వేణుగోపాల్ 1.53 లక్షల విలువైన బైక్‌లను విరాళంగా ఇచ్చారు. ఆలయ ఏఈవో మోహన్ రాజు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయ ఇంచార్జ్ హరిబాబుకు వాహనతాళాలు, పత్రాలను అందజేశారు.



వాహనాలను విరాళంగా అందజేస్తున్న దాత

మా స్థలాన్ని ఆక్రమించే యత్నం

● కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ పోసుకున్న మహిళలు



పోలీసుల సమక్షంలో పెట్రోల్ పోసుకుంటున్న లక్ష్మీదేవమ్మ

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'మా స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. వాళ్లకే అధికారులు, పోలీసులు అండగా నిలుస్తున్నారు. ఇల్లు కట్టుకోనీయకుండా మమ్మల్ని వేధిస్తున్నారు. మాకిక చావే శరణ్యం' అంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట బాధితురాలు వెంకటసుబ్బమ్మ, ఆమె చెల్లెలు లక్ష్మీదేవి, కుమార్తె భారతి ఒంటిపైన పెట్రోల్ పోసుకోవడం కలకలం రేగింది. బాధితులు తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన సర్వే నెంబరు 12లో బండి వెంకటసుబ్బమ్మకు 90 అంకణాల స్థలం ఉంది. 40 ఏళ్లగా నివాసం ఉంటున్నారు. 1990లో తిరుపతిలోని ఓ మద్యం వ్యాపారి ఆ స్థలం తనదని రాగా కోర్టు తప్పుపట్టడంతో వెళ్లిపోయాడు. ఆ తర్వాత గోపీకృష్ణ అనే వ్యక్తి తప్పుడు డాక్యుమెంట్లతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులను మాపైకి పంపాడు. అన్ని కోర్టులలో మాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఇప్పుడున్న రేకుల షెడ్‌ను తొలగించి ఇంటిని కట్టుకునేందుకు అప్రూవల్‌కు మున్సిపాలిటీకి రూ.75వేల చలానాకూడా కట్టాం. ఇల్లు నిర్మించే క్రమంలో ఆదివారం పోలీసులు వచ్చి మమ్మల్ని బెదిరించి స్టేషన్‌కు రావాలన్నారు. మున్సిపాలిటీ వాళ్లల ఫోను చేసి బెదిరిస్తున్నారు. ఓ టీడీపీ నేత వద్ద గోపీకృష్ణ పనిచేస్తున్నాడని.. అతడి రాజకీయ అండతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ లక్ష్మీదేవి, భారతి పెట్రోల్ పోసుకున్నారు. దీంతో కలకలం రేగింది. డీఆర్వో నరసింహులు అక్కడికి వెళ్లి వారికి నచ్చచెప్పి కలెక్టరేట్‌కు తీసుకెళ్లారు. వారి సమస్యలపై దృష్టిపెట్టాలని ఆర్డీవో రామ్మోహన్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కాగా, బాధితులిద్దరూ ఒకరి తర్వాత ఒకరు పెట్రోల్ పోసుకుంటున్నా విధుల్లోని పోలీసులు వారించకపోవడం విమర్శలకు తావిచ్చింది. తిరుచానూరు సీఐ అక్కడికి చేరుకుని బాధితులను సముదాయించారు.

వ్యాస రచన పోటీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో వ్యాస రచన పోటీలను నిర్వహించనున్నారు. రచయిత్రి ఓల్గా తండ్రి పోపూరి వెంకట సుబ్బారావు స్మారకోపన్యాస కార్యక్రమం సందర్భంగా 'సాహిత్య సృజన ద్వారా రచయిత్రులు అందిస్తున్న విలువలు' అంశంపై కాలేజీ, యూనివర్సిటీ స్థాయి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తారు. ఎంపికైన ఉత్తమ వ్యాసానికి 27న రూ.10 వేల నగదు బహుమతి అందించనున్నారు. ఈ నెల 11 లోపు 10 పేజీల్లో వ్యాసాన్ని 'డాక్టర్ డి. యువశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, పద్మావతి మహిళా యూనివర్సిటీ, తిరుపతి అనే చిరునామాకు పంపవలసి ఉంటుంది. మరిన్ని వివరాలకు 9885940011 ఫోన్ నంబరులో సంప్రదించాలని డాక్టర్ యువశ్రీ కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు డిజిటల్ వెయింగ్ మిషన్లు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు3(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసేందుకు టాటా ట్రస్టు సహకారంతో విజయవాహిని చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు రూ.9 లక్షలు విలువైన 734 వెయింగ్ మిషన్లను కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సోమవారం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ మిషన్లు పిల్లలు, గర్భిణుల పోషకాహార స్థితిని తెలుసుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువన్షీ, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, టాటాట్రస్టు జిల్లా ప్రోగ్రాం అధికారి అమరావతి పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన యూఎన్ విజన్ దౌత్యవేత్త

● పరిశ్రమలు, విద్య సమన్వయ వాతావరణంపై ప్రశంశ

సత్యవేడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మాస్కోలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఇన్ఫర్మేషన్ (ఐసీఎస్‌టీఐ) నిపుణుడు, యూఎన్ విజన్ దౌత్యవేత్త జయరాములు లింగుట్ల సోమవారం రాష్ట్ర పర్యటనలో భాగంగా శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. శాస్త్రీయ ప్రణాళిక, దార్శనిక నాయకత్వంతో రూపొందించచిన శ్రీసిటీ, దాని ప్రాంతీయ సామర్థ్యాలను ప్రపంచస్థాయికి చేర్చిందని ఈ సందర్భంగా సన్నారెడ్డి పేర్కొన్నారు. ఐసీఎస్టీఐ, యునైటెడ్ నేషన్స్ వంటి అంతర్జాతీయ సంస్థలతో కలిపి పరిశ్రమ - విద్యా సమన్వయ విధానాలను అభివృద్ధి చేయడం శ్రీసిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. శ్రీసిటీ వేగవంతమైన అభివృద్ధిని ప్రశంశించిన జయరాములు 31 దేశాలకు చెందిన 245కు పైగా సంస్థలు ఇక్కడ నెలకొల్పడాన్ని కొనియాడారు. శ్రీసిటీ పరిశ్రమలు, ప్రభుత్వాలు కలిపి చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ద్వారా స్థానిక యువతకు పరిశ్రమలలో అవకాశాలు కల్పిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. శ్రీసిటీలోని రష్యన్ కంపెనీ కూబిషెన్ అజోట్ సహా పలు పరిశ్రమలను ఆయన సందర్శించి పరిశ్రమ - విద్యా సమన్వయ అనుకూల అంశాలను పరిశీలించారు. అంతర్జాతీయ నైపుణ్య విశ్వ విద్యాలయం స్థాపనకు శ్రీసిటీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. బ్రిక్స్ ఐపీఎం అండ్ ఐపీబీసీ సహాధ్యక్షుడు, యూఎన్‌జీఏ 78 సమ్మిట్ కన్వీనర్, ఐయూసీఎస్ ఆసియా సభ్యుడు, యునా ఏసీటీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయరాములు ప్రస్తుతం ఐసీఎస్టీఐ - యూఎన్ పర్యవేక్షణలో మహానందిలో తలపెట్టిన ఆసియా పసిఫిక్ వర్క్ స్టేషన్ (ఏపీడబ్ల్యుఎస్) స్థాపనకు నేతృత్వం వహిస్తున్నారు.



జయరాములు లింగుట్లను సన్మానిస్తున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

తిరుమల తరహాలో.. తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు భద్రత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో తిరుచానూరు పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భద్రత కల్పించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన ఉన్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సోమవారం జిల్లా పోలీసు కమాండ్ కంట్రోలు యూనిట్‌లో పోలీసు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. భక్తుల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వాహనాల పార్కింగ్, శక్తి టీమ్ పర్యవేక్షణ, మహిళా భక్తుల రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, రామకృష్ణ, నాగభూషణరావు, శ్రీనివాసరావు, డీఎస్పీలు వెంకటనారాయణ, భక్తవత్సలం, ప్రసాద్, రామకృష్ణమాచ్చారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

ట్రాక్టర్ కిందపడి కూలీ మృతి



గూడూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం కందలి గ్రామ సమీపంలోని చెమిర్తి రోడ్డు వద్ద ట్రాక్టర్‌లో వెళుతున్న ఓ కూలీ ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని కందలి గ్రామానికి చెందిన వెంకటరమణయ్య(52) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. సోమవారం మట్టి పనులకు వెళ్లేందుకు ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చొని ప్రయాణిస్తున్న వెంకటరమణయ్య ప్రమాదవశాత్తు కిందపడడంతో టైర్ అతని మీద వెళ్లడంతో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త ఏరియా ఆస్పత్రి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, కందలి సమీపంలో అక్రమంగా క్వారీలో నిర్వహిస్తున్నారని, అక్కడ లారీలో లోడింగ్ చేస్తున్న క్వార్ట్‌రాయి ప్రమాదవశాత్తు వెంకటరమణయ్యపై పడడంతోనే మృతి చెందినట్లు కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు.

టీడీపీ నేతలపై కేసు కొట్టివేత

తిరుపతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల సందర్భంగా టీడీపీ నేతలపై పెట్టిన కేసును సోమవారం స్థానిక 4వ అదనపు న్యాయస్థానం కొట్టివేసింది. టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, అతని సోదరుడు, 2వ డివిజన్ ఇన్‌చార్జి రామ యాదవ్, కార్పొరేటర్ అభ్యర్థి శాంతి యాదవ్‌లపై 2021 మార్చి 10వ తేదీన జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ వైసీపీ కేసులు బనాయించింది. వైసీపీ దొంగ ఓట్లను అడ్డుకుని ఎన్నికల ప్రక్రియను నిరసిస్తూ టీడీపీ నేతలు ఆందోళన చేపట్టారు. దీంతో వారిపై వైసీపీ నేతలు కేసు నమోదు చేయించారు. నాలుగున్నరేళ్ల తర్వాత న్యాయస్థానం కేసును కొట్టివేసింది. ఈ సందర్భంగా నరసింహ యాదవ్ మాట్లాడుతూ అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టినా చివరకు న్యాయం గెలిచిందన్నారు. ఈ తీర్పు వైసీపీకి చెంపపెట్టు లాంటిదన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీలలో తిరుపతి బాలిక సత్తా

తిరుపతి (క్రీడలు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంగోలియా రాజధాని ఉలాన్బాతార్‌లో గతనెల 24నుంచి ఈనెల 2 తేదీ వరకు జరిగిన 19వ ఆసియా స్కూల్స్ బ్లిడ్జ్ చెస్ చాంపియన్స్ షిప్ పోటీలలో తిరుపతికి చెందిన త్రిపురాంబిక సత్తా చాటింది. అండర్ 13బాలికల విభాగంలో తృతీయస్థానంలో నిలిచి రజత పతకం, ప్రశంసాపత్రం అందుకుంది. రాపిడ్, బ్లిడ్జ్ విభాగాలలో అత్యధిక రేటింగ్ 149 పాయింట్లతో రికార్డు నెలకొల్పింది. ఆ దేశ ప్రధాని గొమ్బోజావ్యిన్‌జందనస్టార్ అభినందించారు. తుడా ఛైర్మన్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, సెక్రటరీ శ్రీనివాసమూర్తి, సీఏవో బాలాజీ అభినందించారు.



త్రిపురాంబికను అభినందిస్తున్న మంగోలియా ప్రధాని

శాస్త్రీయ నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీలోని ఉమెన్ బయోటెక్ ఇన్క్యుబేషన్ ఫెసిలిటీ సెంటర్‌లో పాఠశాల స్థాయి విద్యార్థులకు శాస్త్రీయ నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం ప్రారంభమైన ఈ శిక్షణ ఈనెల 7వ తేదీ వరకు కొనసాగనుంది. పీఎం-ఉష ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ వాణి నేతృత్వంలో అధ్యాపకులు విద్యావతి, శోభ, నీలకంఠయ్య విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు

సైకాలజీ ఘటనపై విచారణ

ఎస్వీయూ అధికారుల నిర్ణయం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సైకాలజీ విభాగ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఓ ప్రొఫెసర్ సీనియర్ల చేత జూనియర్లను వేధిస్తున్నారని వర్సిటీ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విద్యార్థి సంఘాలు సోమవారం ఆందోళన చేపట్టాయి. ఈ క్రమంలో రెక్టార్ ఛాంబర్ తలుపు అద్దాలు పగిలాయి. స్పందించిన అధికారులు ఘటనపై విచారణకు ఆదేశిస్తున్నట్టు తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు చలపతి, అశోక్, మల్లికార్జున, రవి, అక్బర్, సుందర్, శివశంకర్ నాయక్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

గ్యాస్ ప్లాంట్ పనులు త్వరగా పూర్తిచేయాలి

● అదనపు ఈవో వెంకయ్య

తిరుమల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఐఓసీఎల్ ప్లాంట్ పనులను త్వరగా పూర్తి చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. పద్మావతి అతిథిగృహంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. తొలుత పీఏసీ-5పై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ.. ఏపీసీ-5లో వేడి నీటి కోసం సోలార్ ప్యానల్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలన్నారు. స్టెయిన్‌లెస్ స్టీల్ పాదరక్షల ర్యాక్‌లు ఏర్పాటు చేయాలన్నారు. లాకర్లు, హాల్స్ కల్యాణకట్ట, మెడికల్ సౌకర్యాలు, అన్నప్రసాద వివరాలు రిసెప్షన్ విభాగం సమన్వయంతో డైనమిక్ ఇన్ఫర్మేషన్ రూపంలో పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ద్వారా ప్రకటించాలన్నారు. భక్తుల భద్రత కోసం విజిలెన్స్ విభాగం తగినంత సిబ్బందిని నియమించాలని, సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రెండో ఘాట్‌రోడ్డు బీటీ కోటింగ్ పనులపై కొన్ని సూచనలు చేశారు. కొండలపై నుంచి పడే వర్షపు నీటి వల్ల అక్కగార్ల ఆలయం వద్ద భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఆ నీటిని కల్వర్టుల ద్వారా అడవిలోకి మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

కార్తీక పౌర్ణమికి శివాలయాల్లో ఏర్పాట్లు


సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయం

తడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకల కోసం శివాలయాలు సిద్ధమయ్యాయి. సూళ్లూరుపేటలో ఉన్న నాగేశ్వరస్వామి ఆలయం, మన్నారు పోలూరులోని కాళంగ నది తీరాన ఉన్న సంతానేశ్వరస్వామి ఆలయం, నాయుడుపేట స్వర్ణముఖి నది తీరాన ఉన్న జ్ఞానప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి, బ్రాహ్మణ వీధిలో ఉన్న జంబుకేశ్వర ఆలయం, తడ బోడిలింగాలపాడు వద్దనున్న భువనేశ్వరి సమేత భువనేశ్వరస్వామి ఆలయం, చిన్నమాంబట్టు అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలను వెలిగించేందుకు తగిన వసతులు కల్పిస్తున్నారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే అభిషేకానంతరం స్వామివారిని భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో ఆలయాలు వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా ఆలయాల నిర్వాహకులతో చర్చించి క్యూలైన్ల నిర్వహణ, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

కోట: గూడలిలోని స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన సంగమేశ్వరాలయంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు తమిళనాడు నుంచి భక్తులు వచ్చి కార్తీక పౌర్ణమిరోజున దీపాలు వెలిగించడం పరిపాటి. ఈ నేపథ్యంలో ఆలయంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

వాకాడు: మండలంలోని పులికాట్ సరస్సు సమీపంలో ఉన్న కామాక్షీదేవి సమేత పాండురంగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి నాడు వందలాది మంది భక్తులు చేరుకొని దీపారాధన చేసి మొక్కులు తీర్చుకుంటారు.

తూపిలిపాళెంలో మెరైన్ పోలీసుల బందోబస్తు

వాకాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా తూపిలిపాళెం సముద్రతీరంలో బుధవారం మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నట్లు మెరైన్ సీఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు సముద్రస్నానాల కోసం తూపిలిపాళెం సముద్రతీరానికి వస్తారని, ఆ సమయంలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా 9మంది మెరైన్, మరో 9మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తామని సీఐ పేర్కొన్నారు.

లోతైన జలపాతాల్లో కార్తీక స్నానాలకు వెళ్లొద్దు

డక్కిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నేపథ్యంలో చెరువులు, కాలువలు, జలపాతాల వద్ద స్నానాలకు వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని తెలుగుగంగ కాలువతో పాటు అన్ని చెరువులు, వాగులు, కుంటల వద్ద ప్రజలను అప్రమత్తం చేసేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. కార్తీక స్నానాల పేరుతో లోతైన జలపాతాల్లో దిగితే ప్రమాదాల బారిన పడితే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలను చెరువుల వద్దకు తీసుకువెళ్లవద్దని తల్లిదండ్రులకు సూచించారు. దీనిపై సర్పంచులు, వీఆర్వోలు, కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం దేవుని వెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి వెళ్లి కార్తీక మాసం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులు నాయుడు, వీఆర్వో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ


క్రీడాకారులతో తైక్వాండో అసోషియేషన్ కార్యదర్శి అఖీల్, కోచ్ పవన్

నాయుడుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 1, 2 తేదీల్లో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ తైక్వాండో పోటీల్లో నాయుడుపేట విద్యార్థులు ప్రతిభ చూపినట్లు తైక్వాండో అసోషియేషన్ జిల్లా కార్యదర్శి అఖీల్, కోచ్ ఉయ్యాల పవన్‌కుమార్ తెలిపారు. అండర్-17 బాల బాలికల విభాగంలో పి.దీపిక రజతం, సీహెచ్ ప్రశాంతి క్యాంస పతకం కైవశం చేసుకున్నట్లు తెలిపారు.

గ్రామనత్తం ఆక్రమణపై చర్యలు తీసుకోండి


తహసీల్దారు పద్మావతితో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఓజిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రావిపాడు పంచాయతీ లింగారెడ్డిపల్లిలో గ్రామనత్తం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దారు పద్మావతిని కోరారు. సోమవారం గ్రామానికి చెందిన కొందరితో కలసి ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దారుకు అర్జీ ఇచ్చారు. సర్వే నెంబరులోని 56/18లో 1.02 ఎకరాల భూమిలో 0.11 సెంట్ల గ్రామనత్తం భూమిని ఆక్రమించారని, దీంతోపొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోయిందన్నారు. తహసీల్దారు స్పందిస్తూ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

9న ఏఎంసీ పాలకమండలి ప్రమాణస్వీకారం


ఎమ్మెల్యే విజయశ్రీతో ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ తదితరులు

నాయుడుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఈనెల 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని కలిసి మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో గిండి సతీష్, సుజాతమ్మ, భాస్కర్‌రెడ్డి, కన్నెమ్మ, గోను బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

వాకాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎంపీడీవో సాయిప్రసాద్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, దువ్వూరు జనార్దన్ రెడ్డి కోరారు. సోమవారం వారు ఎంపీడీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో తాగునీరు అందేలా చూడాలన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి

చిల్లకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో సోమవారం వేకువజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీడ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... చైన్నైకు చెందిన ఎలుమలై(51) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం వేకువ జామున పోలీస్‌స్టేషన్ సమీపంలో లారీని ఆపి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఎలుమలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భిక్షగాడిపైకి దూసుకెళ్లిన కారు

కోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోట బజారు సెంటర్‌లోని గాంధీ బొమ్మ విగ్రహం వద్ద సోమవారం మతి స్థిమితం లేని భిక్షగాడిపై గుర్తుతెలియని కారు ఎక్కడంతో కాలు నుజ్జునుజ్జు అయ్యింది. అతడిని పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు.


ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న భిక్షగాడు



గూడూరు, సూళ్లూరుపేటలోని శివాలయాల్లో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

శివాలయాలకు కార్తీక శోభ


నాయుడుపేట స్వర్ణముఖినదిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శివాలయాలు కార్తీక శోభ సంతరించుకున్నాయి. సూళ్లూరుపేట పట్టణంలోని నాగేశ్వరస్వామి ఆలయం, మన్నారుపోలూరులోని సంతానేశ్వరస్వామి, టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుని ఆలయాల్లో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. నాగేశ్వరస్వామి, అభయశంకరుని ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయాని చేరుకొని భక్తులు స్వర్ణముఖినదిలో స్నానాలు చేసి దీపాలు వదిలి మొక్కులు తీర్చుకున్నారు.

గూడూరు: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాల్లో పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయం, వీరభద్రస్వామి, సోమసుందేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలగించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయం, వల్లివేడు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న మల్లిఖార్జున భ్రమరాంబిక ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

అభివృద్ధిలో భాగస్వాములవుదాం: పాశిం


శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీలో మహిళా బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు

కోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. కోట పట్టణంలో ఆధునికీకరించిన స్వర్గధామం(హిందూ శ్మశానవాటిక)ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా కోట పటణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో మహిళా బ్యాంక్‌ను, గిరిజన మత్స్యకారుల కోసం ఏర్పాటు చేసిన ఫిష్ మార్కెట్‌ను సునీల్‌కుమార్ ప్రారంభించారు. అక్కడ నుంచి తిన్నెలపూడి, తాటితోపు సమీపంలో ఉన్న చల్లకాలువ నది వద్దకు చేరుకుని పూడికతీత పనులకు సంబంధించి ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్ర మాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మర్రి ప్రమీల, ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్, మోబిన్, నారాయణ, ఎంపీపీ అంజమ్మ, సర్పంచ్ వెంకట రమణమ్మ, సుహాసిని, పోలమ్మ, టీడీపీ నాయకులు చిల్లకూరు దశరధరామిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పోలయ్య, జితేంద్రరెడ్డి, తిరుమలశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయండి: విజయశ్రీ


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి అధికారులు, పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. సోమవారం దొరవారిసత్రంలో నెలబల్లి సహకార సంఘం(పీఏసీఎస్) పాలకవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. చైర్మన్‌గా ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, సభ్యులుగా సంచి విజయ్‌కుమార్, మన్నేపల్లి సుబ్రహ్మణ్యం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం సొసైటీలను బలపేతం చేయాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి, సూళ్లూరుపేట, నాయుడుపేట ఏఎంసీల చైర్మన్లు ఆకుతోట రమేష్, ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాకంటే మాకే!

- పనుల కోసం అధికార పార్టీ నేతల వాగ్వాదం
- ఎమ్మెల్యే వద్దకు చేరిన పంచాయితీ

సూళ్లూరుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలో పనుల పంపకం.. అధికార పార్టీ నాయకుల మధ్య తీవ్ర వివాదాలకు దారితీసింది. నువ్వెంతంటే... నువ్వెంత అనే తీవ్రస్థాయికి వాగ్వాదం చోటుచేసుకుంది. దీనికి మండల పరిషత్ కార్యాలయం వేదికైంది. మండలంలో 19 పంచాయతీలకు గాను 18కి ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణాలకు దాదాపు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. ఆ పనులను తమ తమ వర్గానికి చెందిన వారికి ఇప్పించేందుకు నేతలు ప్రయత్నాలు చేపట్టడం వివాదానికి కారణమైంది. ఇదే విషయమై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పులికాట్ తీర ప్రాంత గ్రామ నాయకులు, ఉత్తరంవైపున్న గ్రామాలకు చెందిన నాయకుల నడుమ ఎంపీడీవో ముందే తీవ్ర వాగ్వాదం చేసుకుంది. అరుపులు.. కేకల నడుమ బాహాబాహికి దిగే స్థాయికి చేరింది. సర్పంచ్‌లకు, స్థానిక నాయకులకు తెలియకుండా వేరేప్రాంతానికి చెందిన నేతలు పనులు చేసేందుకు కొందరు సిఫార్సు చేస్తున్నారని పులికాట్ తీరప్రాంతానికి చెందిన మండల స్థాయి నాయకులు మండిపడుతున్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి ఎలా పనులు కేటాయిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. తమకు తెలికుండా తమ గ్రామంలో వేరొక్కరికి పనులు ఎలా కేటాయిస్తారంటూ ఎంపీడీవో మురళీకృష్ణను సైతం కొందరు నిలదీశారు. ఈ పంచాయితీ చివరకు ఎమ్మెల్యే వద్దకు చేరింది.

ఈ కొలువులు మాకొద్దు

- పంచాయతీ కార్యదర్శులు సెలవుపై వెళ్లే యోచన?

మరోవైపు అధికార పార్టీ నాయకుల ఒత్తిడి భరించలేకున్నామని, నిబంధనలకు విరుద్ధమైనా పనులు చేయాలంటూ హుకుం జారీచేస్తున్నారంటూ పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'సంక్షేమ పథకాలు మొదలు ప్రతి పని మేము చెప్పిన వాళ్లకే ఇవ్వాలని, మిగిలిన వారికి ఇవ్వకూడదంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఇలా చేస్తే ఉన్నతాధికారులు మెమోలు ఇస్తారని.. ఉద్యోగాలు పోతాయని చెప్పినా వినిపించుకోవడం లేదు. తాజాగా సిమెంటు రోడ్ల విషయంలోనూ ఇదేవిధంగా చెబుతున్నారు. ఇలాగైతే మేమిక పనులు చేయలేం' అంటూ వీరు సోమవారం ఎంపీడీవో మురళీకృష్ణను కలిసి చెప్పినట్లు తెలిసింది. తాము ఇక్కడ పని చేయలేమని, మూకుమ్మడిగా సెలవు పెట్టి వెళ్లిపోతామంటూ మొరపెట్టుకున్నట్లు సమాచారం. తొందరపాటు వద్దని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఎంపీడీవో హామీ ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ పంచాయితీ కూడా సోమవారం రాత్రి ఎమ్మెల్యే వద్దకు చేరింది.

యూరియా కొరత లేకుండా చూడాలి


ఏవోలతో మాట్లాడుతున్న ఏడీఏ అనసూయ

వెంకటగిరిటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో రబీ సీజన్ నారుమడులు, నాట్లు ప్రారంభం కానున్న సందర్భంగా రైతులకు యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఏడీఏ అనసూయ అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొసైటీ, ఆర్‌బీకేల వద్ద యూరియా అందుబాటులో ఉందని, పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏవోలు సుజాత, శిరీషా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

బాలాయపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేలో పలు సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. మొత్తం 27 అర్జీలు అందినట్లు తహసీల్దారు విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, ఏవో విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

దొరవారిసత్రం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దొరవారిసత్రం మండలం నెలబల్లిలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. రాహుల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మునస్వామి నాయుడు, సురేష్‌రెడ్డి, వేమురెడ్డి, హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నాయుడుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణానికి చెందిన సారంగం మురళీకృష్ణ ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా అనారోగ్యంతో పనులు చేసుకోలేక ఇంటికే పరిమితమయ్యాడు. అతనికి బలిజ చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు పగడాల శివప్రదీప్, కార్యదర్శి హంసా వృద్వీ రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో హంసా రామారావు, నీలం హరీ, పసుపులేటి కృష్ణ తదితరులు ఉన్నారు.

స్వర్ణముఖిలో పారిశుధ్య పనులు

నాయుడుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా 5వ తేదీన భక్తులు అధికంగా వచ్చే స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలోని జ్ఞానప్రసూనాంబ నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం వద్ద సోమవారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. స్వర్ణముఖినదిలో భక్తులకు స్నానాలు ఆచరించే ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పోలీసులు పరిశీలించారు.

రైతులకు యూరియా పంపిణీ

వాకాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాకాడు సొసైటీ కార్యాలయంలో సోమవారం వ్యవసాయశాఖ అధికారిణి దీప, సొసైటీ చైర్మన్ ఉచ్చూరు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్‌రెడ్డి, దువ్వూరు జనార్దన్‌రెడ్డి రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నందగోపాల్‌రెడ్డి, పసుపులేటి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవోకి వినతిపత్రాలను అందజేశారు. ప్రధానంగా భూ సమస్యలపై అధికంగా వినతులు అందాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచండి


నారుమడులను పరిశీలిస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

పెళ్లకూరు, నవంబరు, 3 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని నాయుడుపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు నాగార్జునసాగర్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని నెలబల్లిలో నారుమడులను ఆయన పరిశీలించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నారుమడుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని నాయుడుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు నాగార్జునసాగర్ రైతులకు సూచించారు. కాండం తొలుచు పురుగులను గమనించిన ఆయన వేప నూనె పిచికారి చేయాలని సూచించారు. అలాగే నాట్లు వేసే ముందు 30 కేజీల నారుమడికి ఒక కేజీ కార్బోపురాన్, 3జీ గుళికలు వేసుకోవాలన్నారు. దీనివల్ల నాటిన నెల రోజుల వరకు పంటకు సస్యరక్షణ కల్పిస్తుందన్నారు. నెలబల్లి రైతు సేవా కేంద్రంలో ఏవో విజయభారతి కలిసి రైతులకు యూరియా పంపిణీ చేశారు. అనంతరం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హరికృష్ణతో కలసి సమావేశమయ్యారు. అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల పెండింగ్ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏ సుమతి, అశోక్ నీటి సంఘం అధ్యక్షుడు చిల్లకూరు మాధవరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ యూరియా అందించాలి

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ యూరియా అందించాలని కౌలు రైతు సంఘం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది రోజులుగా రైతులు యూరియా పొందేందుకు గుర్తింపు కార్డుల కోసం కార్యాలయం చుట్టు ప్రదక్షణ చేస్తున్నా వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బ్లాక్ మార్కెట్‌లో ఒక్క యూరియా బస్తా రూ.800 వరకు విక్రయిస్తున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. రైతులకు యూరియా అందించకపోతే పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాగరాజు, వెంకటసుబ్బయ్య, రగు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు అభినందన వెల్లువ


తహసీల్దారు జయజయరావును అభినందిస్తున్న గూడలి పంచాయతీ టీడీపీ నాయకులు

కోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోట తహసీల్దారు జయజయరావును పలు పార్టీల నాయకులు అభినందించారు. మొంథా తుఫాన్ సమయంలో విస్తృతంగా సహాయక చర్యలు చేపట్టిన జయజయరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రసంశాపత్రం అందుకున్నారు. సోమవారం గూడలి పంచాయతీకి చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, మస్తాన్‌బాషా, పెంచలయ్య, బందిలి రఘు రామయ్య, సుబ్రహ్మణ్యం, చల్లా కృష్ణ, కేశవరం పంచాయతీ నుంచి టీడీపీ బీసీ సెల్ నాయకుడు వరిదిగొల్ల కోటేశ్వరప్రసాద్, చిట్టేడు పంచాయతీ నుంచి మాజీ ఎంపీటీసీ కృష్ణపట్నం చంద్రశేఖర్, బీటీఏ తరఫున నాయకుడు ప్రభాకర్, హరనాథ్‌బాబు, కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, శేఖర్ పూలమాలలు, శాలువాలతో తహసీల్దారు జయజయరావును అభినందించారు.

పులికాట్‌లో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు అటవీశాఖ అధికారుల అభ్యంతరం

ఎమ్మెల్యే చొరవతో సరఫరా పునరుద్ధరణ

సూళ్లూరుపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పులికాట్ తీరంలో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో కుదిరి, అట్టకానితిప్ప, వేనాడు గ్రామాలకు సరఫరా ఆగిపోయింది. విద్యుత్‌శాఖ అధికారులు తాత్కాలికంగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేసి సరఫరా పునరుద్ధరించారు. పులికాట్ సరస్సులో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను తొలిగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు విద్యుత్‌శాఖ అధికారులు సోమవారం పనులు ప్రారంభిం చారు. అయితే పులికాట్ పరిధిలో కొత్తగా ఎటువంటి పనులు చేయ రాదంటూ ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె డీఎఫ్‌వో హారికతో మాట్లాడారు. కొత్త పనులు చేయడం లేదని, ఒరిగిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారని, పనులకు ఆటంకం కలిగించవద్దని కోరారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులు పులికాట్ సరస్సులో కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి సరఫరా పునరుద్ధరించారు.